PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 31.05.2013, శుక్రవారం సంపుటి : 32 సంచిక : 52 పేజీలు : 16, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



ప్రజల వెంటే నేనుంటా... అని హైదరాబాద్‌లో జరిగిన మహానాడు వేదికగా తెలుగుదేశాధినేత చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రజలు తన వెంట లేనప్పుడు ఇక ఆయన ప్రజల వెంటపడక తప్పుతుందా?

తెలుగుదేశం వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు మహానాడు సంస్కృతిని ప్రవేశపెట్టారు. ప్రతి ఏటా ఎన్టీఆర్ జన్మదినోత్సవం రోజున మహానాడు జరుగుతుంది. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ మహానాడు అంటే మేడారం జాతర మాదిరిగా జరిగేది. మహానాడు ప్రాంగణం పసుపుమయం అయ్యేది. కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేవాళ్ళు.

# 'మహో' బా(డా)బు

కాని నిన్నటి మహానాడులో ఆ ఉత్సాహం కనిపించలేదు. తొమ్మిదేళ్లుగా పార్టీ అధికారానికి దూరంగా వున్న లోటు స్పష్టంగా కనిపించింది. ఆశతో, ఆసక్తితో ఎవరూ మహానాడుకు రాలేదు. జిల్లాలో, నియోజకవర్గాల స్థాయి నాయకులు తలా కొంత డబ్బు పోగేసి జనాలను బలవంతంగా మహానాడుకు తరలించారు. ఇంత చేసినా మహానాడుతో తెలుగుదేశానికి అదనంగా ఒరిగిందేమీ లేదు. వచ్చే ఎన్నికల్లో అధికారం కలేననే విషయం చంద్రబాబుకు తెలుసు. అయినా మహానాడులో మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించాడు. అవినీతి గురించి మహాత్ముడికంటే ఎక్కువ సూక్తులు చెప్పాడు. అవినీతిపై పోరాటంలో అన్నాహజారేకు తమ్ముడి లాంటి వాడినన్నట్లు మాట్లాడారు. ఇక ప్రతి అడుగు లోకకల్యాణం కోసమే వేస్తానన్నాడు. జనచైతన్యానికి బస్సుయాత్ర చేస్తానంటున్నాడు. కులానికొకటి చొప్పున డిక్లరేషన్ ప్రకటించాడు. ఇవన్నీ కూడా అధికారాన్ని ఎలాగైనా దక్కించుకోవాలనే తపనతో చేస్తున్నవే!

చంద్రబాబు ఎన్ని రకాలుగా నీతులు వల్లించినా, ఎంతగా వాగ్దానాలు కుమ్మరించినా ప్రజలు వినే పరిస్థితి లేదు. విన్నా నమ్మే పరిస్థితి లేదు. కారణం ఆయన గతంలో 9ఏళ్ల (మిగతా 10వ పేజీలో)

# లేడీ లీడర్స్



## కన్నీళ్లను దిగమింగి... తమ శక్తిని చాటుతున్నారు

భారతదేశానికి ఇప్పటివరకు 14మంది ప్రధానమంత్రులుగా పని చేసారు. వీరిలో ఒకే ఒక్క మహిళా ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ. ఆమె దివంగతులయ్యి ముప్పై ఏళ్లయ్యింది. ఈరోజుకు కూడా ఈ దేశాన్ని అత్యంత సమర్థవంతంగా పరిపాలించిన ప్రధాని ఎవరంటే మొదటగా వినిపించే పేరు ఇందిరాగాంధీ! 14మంది ప్రధానులలో మేటి ప్రధానిగా గణుతికెక్కారామె. (మిగతా 10వ పేజీలో)

# వైభవంగా రాహుకేతు మండపం ప్రారంభం

(వివరాలు 12వ పేజీలో)



మే29వ తేదీ నెల్లూరు మూలాపేటలోని శివాలయంలో రాహుకేతు మండపం ప్రారంభం సందర్భంగా వెండి నాగాభరణాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. పక్కన ఎమ్మెల్యే వివేకా.

# విశాఖలో స్టార్‌వార్





సాధారణ జీవితంలో కొన్ని సంఘటనలు మనకు తారసపడుతుంటాయి. కొందరు అద్దెకు ఇంటిని తీసుకునేటప్పుడు ఎంతో వినయంగా వుంటారు. కొద్దిరోజులు గడుస్తాయి. యజమానికే అద్దెఇల్లు అవసరమవుతుంది. అద్దెకున్న వాళ్లను ఖాళీ చేయాలని యజమాని కోరుతాడు. వాళ్లు ఖాళీ చేయరు. దిక్కున్నచోట చెప్పుకో మంటారు. ఇలాంటి (మిగతా 10వ పేజీలో)



# రియల్టర్ల పోర్టు గేమ్

- రామాయపట్నాన్ని నమ్ముకుని మునిగిన రియల్టర్లు
- దగాపడ్డవారిలో ప్రజాప్రతినిధులు
- దుగరాజపట్నంపై ఇంకా తొలగని సందేహాలు



జిల్లాలో కృష్ణపట్నం పోర్టు వచ్చింది. దానివల్ల రియల్‌బూమ్ జిల్లాను ఒక వూపు వూపింది. తొండలు గుడ్లు పెట్టే భూముల రేట్లు కూడా ఎక్కడికో వెళ్లి పోయాయి. యకరా పొలం వున్న రైతులు కూడా లక్షాధికారులయ్యారు. పెద్ద రైతులైతే కోటీశ్వరులే! లాభపడ్డ వాళ్లు లాభపడగా, అత్యాశకుపోయి అధికరేట్లు పెట్టి భూములు కొన్నవాళ్లు నిండా మునిగిపోయారు. కృష్ణపట్నం పోర్టు మాయలో పడి భూములుకొని తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇప్పుడు చాలామంది నానా తిప్పలు పడుతున్నారు.

ఒక పోర్టు కథ ఈ విధంగా వుండగానే మరో పోర్టు రియల్టర్లతో ఆడుకుంటుంది. కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటు చేయతలపెట్టిన అతిపెద్ద నౌకాశ్రయానికి మొదట దుగరాజపట్నంను ఎంపిక చేసారు. శ్రీహరికోటలోని 'షార్' అభ్యంతరంతో పోర్టు ప్రకాశంజిల్లాలోని రామాయపట్నంకు తరలిపోయింది. రాష్ట్ర ఓడరేవుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా రామాయపట్నం వద్దే పోర్టు అని ప్రకటించడం, అధికారులు భూసేకరణకు శ్రీకారం చుట్టడం జరిగింది. కాని ఉన్నట్లుండి సీన్ రివర్సయ్యింది. తిరుపతి ఎంపీ చింతా మోహన్ కేంద్రంలో చక్రం తిప్పారు. పోర్టును రామాయపట్నంకు కాకుండా దుగరాజపట్నంకే తీసుకొచ్చారు. కేంద్రం దీనికి 8వేల కోట్ల నిధులు మంజూరు కూడా చేసింది. పోర్టు రామాయపట్నమో లేదా దుగరాజపట్నమో... ఎక్కడో ఒక చోట రావాల్సిందే! కాని ఈ పోర్టు మాయలో పడి మళ్లీ కొందరు మునిగారు. రామాయపట్నం వద్ద పోర్టు అని మొదట ఖాయం కావడంతో ఓ మంత్రితో పాటు పలువురు రాజకీయ నాయకులు, వ్యాపారులు, రియల్టర్లు కావలి పరిసరాలలో పెద్ద ఎత్తున భూములు కొన్నారు. కావలి దగ్గర జాతీయ రహదారి వెంబడి భూములు సైతం ఎకరా కోటి రూపాయల దాకా పోయింది. కావలి నియోజకవర్గంలో వుండే ఓ నాయకుడైతే ఇక్కడ ఏకంగా ఓ ఫైవ్‌స్టార్ హోటల్ ప్లాన్ చేసాడు. కృష్ణపట్నం పోర్టు అనుభవంతో కొందరు రియల్టర్లు ఇక్కడ భూముల కొనుగోలుకు పోకుండా జాగ్రత్తపడ్డారు. మరికొందరు మాత్రం పోర్టును నమ్మి భూములు కొన్నారు. పోర్టు దుగరాజపట్నంకు ఖరారు కావడంతో వీళ్లు అయోమయంలో పడ్డారు. లక్షలు, కోట్లు పెట్టి కొన్న భూములు ఇప్పుడు ఎందుకూ పనికిరావు. దుగరాజపట్నం వద్ద పోర్టు అనగానే గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు ప్రాంతాలలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. వేలం వెర్రిలా లేకపోయినా ఇక్కడ రియల్ మార్కెట్‌లో కొంత కదలిక వచ్చింది. దుగరాజపట్నంను కూడా అంత తొందరగా నమ్మనవసరం లేదని, అక్కడ పోర్టు పనులు ప్రారంభించాకే భూముల జోలికి పోతే మేలని చాలామంది వ్యాఖ్యానిస్తున్నారు.

# మళ్లీ హ్యాండిచ్చారు!



రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్మెన్ పదవిపై శ్రీమతి నేదురుమల్లి రాజ్యలక్ష్మి పెంచుకున్న ఆశలు గల్లంతయ్యాయి. ఈ పదవిలో ఇంకా ఎవరినీ నియమించకుండా వుండుంటే కనీసం ఆశలు సజీవంగా వుండేవి. ఈ పదవిలో మరొకరిని నియమించారు. దీంతో రాజ్యలక్ష్మికి మొండిచేయి చూపినట్లయ్యింది. కొన్ని నెలల క్రితమే రాజ్యలక్ష్మికి మహిళా ఛైర్‌పర్సన్ పదవిని సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఖరారు చేసారు. అయితే ఇది తెలిసి ఆనం సోదరులు ఆమెకు పదవి రాకుండా అడ్డుకున్నారు. జిల్లా కాంగ్రెస్‌లో ఆనం సోదరులను కాదని ఏ పనిచేసే పరిస్థితి లేకుండా పోయింది. సీఎం కూడా రాజ్యలక్ష్మికి పదవి ఇవ్వలేక చేతులెత్తేసారు.

నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఎంతోమంది పదవులకు గండి కొట్టారు. ఇప్పుడు వాళ్లకీ ఆ బాధేంటో తెలిసొస్తుంది.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.

స్టేట్ రికార్డ్
మూడవసారి
2013 S.S.Cలో
S.K. ఆర్షియా యాస్మిన్
10/10 పాయింట్లతో స్టేట్ రికార్డ్

రెండవసారి
2012 S.S.Cలో
A.వేదశ్రీ
10/10 పాయింట్లతో స్టేట్ రికార్డ్

మొదటిసారి
2008 సంవత్సరంలో జిల్లా 1వ ర్యాంకు, రాష్ట్రస్థాయి 9వ ర్యాంకు సాధించిన
T.రూప్‌వరుణ్ (580 మార్కులు)

అడ్మిషన్లు జరుగుచున్నవి
Play Class to x Class,
VI to X - IIT మరియు నవోదయ
వ్యాను సౌకర్యము మరియు హాస్టల్ వసతి కలదు
శ్రీనేతాజీ MSR
పైలట్ హైస్కూల్
రెసిడెన్షియల్ స్కూలు
శ్రీనివాస అగ్రహారం, నెల్లూరు
e-mail: snphs@yahoo.com
ఫోన్. 0861-2329470, 2328824, సెల్. 85005 52203, 99494 03302, 94902 05374.

• వైకాపాలో వర్గాల రోత

# సమర్థుల గెంటివేత



వర్గ విభేదాలు, గ్రూపు పోరాటాలు, ముఠా రాజకీయాలలో కాంగ్రెస్‌ను దాటిపోయింది వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ. మన జిల్లా పార్టీలో ఈ విభేదాలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. జిల్లాలో ఒక వర్గం చేస్తున్న అధిపత్య పోకడల కారణంగా మొత్తం పార్టీనే గబ్బు పడుతుంది. పార్టీలో మేము, మా మనుషులు తప్పితే ఇంకెవరూ వుండకూడదన్నట్లు వ్యవహరిస్తున్న వీరి తీరువల్ల పార్టీకి తీరని నష్టం కలిగే అవకాశముంది.

పేనుకు పెత్తనమిస్తే నెత్తినంతా కొరికి పెట్టిందన్నట్లుంది వైకాపాలో మేకపాటి సోదరుల పరిస్థితి. నమ్మి వచ్చారు కదా అని చెప్పి జగన్ వారికి పెద్ద స్థానమిచ్చి గౌరవించారు. దానిని కాపాడుకోవడంలో వారు విఫలమవుతున్నారు. అందరినీ కలుపుకు పోవాల్సిందిపోయి కొందరిని తన వాళ్లనుకుని మిగతా వాళ్లను పార్టీకి దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారు. సహకార ఎన్నికలలో తమ సొంత మండలంలోని రెండు సొసైటీలనే గెలిపించుకోలేక చేతులెత్తేసిన ఈ నాయకులు జిల్లా పార్టీ మొత్తం పెత్తనం తమకేకావాలి, జిల్లాలో అన్ని సీట్లు, అన్ని పదవులు తాము చెప్పినవారికే ఇవ్వాలి అనే ధోరణిలో వున్నారు. వీరి నిరంకుశ ధోరణి కారణంగా పార్టీ నుండి నలుగురు నాయకులను సస్పెండ్ చేశారు. వీళ్లంతా కాకాణి గోవర్ధన్‌రెడ్డి అనుచరులు కావడం గమనార్హం.

వైకాపా జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, కలిగిరి మండల సమన్వయకర్త ఎం.వెంకటసుబ్బానాయుడు, కొండాపురం మండల సమన్వయకర్త కర్తం శ్రీనివాసులురెడ్డి, జిల్లా పార్టీ స్టీరింగ్ కమిటీ సభ్యులు జి.రంగారావులను సస్పెండ్ చేసారు. పార్టీ నిబంధనలను ఉల్లంఘించి క్రమశిక్షణాచర్యలకు పాల్పడ్డారంటూ గతంలోనే వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేసి వున్నారు.

వీరి సస్పెండ్‌కు ప్రధాన కారణం సహకార ఎన్నికలే! కలిగిరి మండలంలో గట్టి పట్టున్న నాయకుడు చిరంజీవిరెడ్డి. కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు కూడా! మొన్న సహకార ఎన్నికలలో చిరంజీవిరెడ్డి ఆయన అనుచరులు సిద్ధనకొండూరు సొసైటీ నుండి పోటీ చేసారు. ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఇక్కడ ప్రత్యేకంగా అభ్యర్థులను నిలబెట్టారు. సొంత మండలంలోనే పార్టీని గెలిపించలేకపోయిన మేకపాటి సోదరులు ఇక కలిగిరి మండలంలో ఏం చించగలరు? చిరంజీవి, ఆయన అనుచరులు సిద్ధనకొండూరు సొసైటీలో ఘనవిజయం సాధించారు. మేకపాటి పెట్టిన వాళ్లు చిత్తుగా ఓడిపోయారు. ఇది మేకపాటికి పరాభవంగా, అవమానంగా తోచింది. చిరంజీవిరెడ్డి మీద కత్తిగట్టి, ఆయనను, ఆయన అనుచరులను పార్టీ నుండి గెంటేయించారు. గుడారంలో ఒంటె దూరేందుకు సందిస్తే అందులో వుండేవాళ్లు బయటకు రావాల్సిందే! మేకపాటి సోదరులు పార్టీలో వున్నంత కాలం మిగతావాళ్లు ఆ పార్టీలో ఇమడలేక బయటకు రావాల్సిందేనేమో!



- పక్షుల మనుగడకే ముప్పు
- గర్భిణిలపై తీవ్రప్రభావం
- వినికిడి సమస్యలు తలెత్తవచ్చు

# రోగాలకు రహదారులు సెల్‌టవర్లు!

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జీవుల మనుగడకే పెనుముప్పుగా మారుతుంది. సమాచార వ్యవస్థలో నూతన అధ్యాయానికి తెరలేపిన సెల్‌ఫోన్లు అనారోగ్యానికి హేతువులుగా మారుతున్నాయి. ఆయా ఫోన్లకు శబ్దతరంగాలు పంపించే సెల్‌టవర్లు హర్రర్‌ను సృష్టిస్తున్నాయి. ఈ ఆధునిక కాలంలో సెల్‌ఫోన్ హస్తభూషణంగా మారిపోయింది. ఇది లేకుండా రోజు గడవడమే గగనమైపోయింది. సెల్ సంకేతాలను ప్రసారం చేసే టవర్ల పనితీరు ఆందోళన కలిగిస్తున్నాయి. అవి వెలువరించే రేడియోధార్మికత మనిషి ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. మొబైల్ టవర్ల నుంచి వెలువడే రేడియో ధార్మికతపై ఆందోళన చేస్తూ ఇప్పటికే వివిధ కోర్టుల్లో పిటీషన్లు దాఖలయ్యాయి. ప్రైవేట్ కంపెనీల పోటీ విధానంలో మెరుగైన ప్రసారాల కోసం సెల్‌టవర్లు ప్రమాద స్థాయిలో రేడియేషన్లు వెదజల్లుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా వెయ్యికిపైగా సెల్‌టవర్లు ఉన్నట్లు సమాచారం. నెల్లూరు నగరంతో పాటు సూళ్ళూరుపేట, గూడూరు, కావలి, వెంకటగిరి, ఆత్మకూరు పట్టణాలలో వందలసంఖ్యలో భవనాలపై సెల్‌టవర్లు వున్నాయి. సెల్‌టవర్ల నుంచి వెలువడుతున్న రేడియేషన్ కారణంగా ఇప్పటికే పావురాలు, పిచుక జాతి నశించింది. 5వాట్స్ నుంచి 10, 15వాట్స్ వరకు కొన్ని ప్రైవేటు కంపెనీలు వినియోగిస్తుండటంతో మనుషులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒక్కో టవర్ ప్రతి చదరపు కిలోమీటరు పొడవున ప్రభావం చూపుతుంది.

**ఎంత ప్రమాదం:** సెల్‌ఫోన్ల వినియోగం పెరిగితే మెదడులో కణితలు ఏర్పడే ప్రమాదం వుంది. కేన్సర్‌కు దారితీసే అవకాశం వుంది. టవర్ రేడియేషన్ ప్రభావంవల్ల మెదడులో నాడీవ్యవస్థ దెబ్బతిని మతిస్థిమితం కోల్పోయే అవకాశం. అంగవైకల్యంతో పిల్లలు పుట్టే అవకాశం వుంది. శరీరంలో హార్మోన్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రేడియోధార్మికత వల్ల చర్మంపై దురద, నొప్పి వంటివి రావొచ్చు. చెవిలో సున్నిత భాగాలు దెబ్బతిని, వినికిడి సమస్య తలెత్తవచ్చు. సెల్‌ఫోన్లను బెల్టులకు అమర్చుకునే పురుషుల్లో కటివిముక సాంద్రత తగ్గుతుందని బయటపడింది. రేడియో ఫ్రీక్వెన్సీ వల్ల గర్భిణులతో పాటు పిండానికి ఇబ్బందులే. గర్భిణులు సెల్‌ఫోన్ ఎక్కువగా వాడితే గర్భస్రావం, బిడ్డకు పుట్టుకతో వచ్చే లోపాలు వంటివి తలెత్తే ప్రమాదం వుంది. ఏదేమైనా ఈ సెల్‌టవర్ల జోరుకు కళ్లెం వేయకపోతే మనిషి మనుగడకు తీవ్ర ప్రమాదం పొటుచేసుకోవడం మాత్రం ఖాయం.

PDF Compressor Free Version



# ముప్పా... హవ్వా



- విద్యాశాఖను ఛండాలం చేసిపెట్టాడు
- గురువుల గోష్ట తగలకపోతుందా?

షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవాలకు, జ్యూయలరీషాపుల ఓపెనింగ్‌లకు, రియల్‌ఎస్టేట్ కంపెనీల బ్రోచర్‌ల విడుదలకు ఫేమస్ సినీహీరోయిన్‌లు గెస్టులుగా వచ్చి నాలుగు చిలుక పలుకులు పలికిపోతుంటారు. అలాగే ముంబై, ఢిల్లీ వంటి మహా నగరాలలో కొందరు ప్రముఖుల వివాహాలకు బాలీవుడ్ అగ్రశ్రేణి హీరోహీరోయిన్‌లు అతిథులుగా వెళుతుంటారు. వీరు అతిథులుగా వెళ్లిన షాపింగ్ మాల్స్ లేదా పెళ్ళి వారితో వీళ్లకు ఎటువంటి సంబంధబాంధవ్యాలు వుండవు. కేవలం మనీ రిలేషన్‌షిప్పే ఇక్కడ ప్రధానం. డబ్బులిస్తే ఈ స్టార్‌లు పెళ్లిళ్లకు వస్తారు. ప్రారంభోత్సవాలకు వస్తారు. భవిష్యత్‌లో కర్మక్రతువులు, తద్దినాలకు వచ్చినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు.

సినిమా యాక్టర్స్ అంటే గెస్టులుగా రావడానికి లక్షలు తీసుకుంటారు. కాని నెల్లూరులో జిల్లా విద్యాశాఖాధికారికి కూడా ఏ స్కూల్ వార్షికోత్సవానికి రావాలన్నా లక్ష రూపాయలు దక్షిణగా ఇచ్చుకోవాలట. ఇది భలే విచిత్రం. ఈమధ్యకాలంలో ఆయా ప్రైవేట్ పాఠశాలల వార్షికోత్సవాలకు జిల్లా విద్యాశాఖాధికారి ముప్పా రామలింగం అతిథిగా ఎక్కువుగా పాల్గొంటున్నారు. వివేకా స్టైల్‌లో ఆయన ఫోటోలతో ఫ్లెక్సీ కటౌట్‌లు పెడుతున్నారు. సినిమా గ్లామర్ వుండి కూడా ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఎక్కడికి గెస్టుగా వెళ్లినా వాళ్లు పెట్టిన ఇడ్లీ, బోండాలు, బిర్యాని తిని రావడం తప్పించి, ఆర్థికంగా ఎటువంటి ప్రయోజనం ఆశించడు. కాని మన డిఇఓ మాత్రం గెస్టుగా రావాలంటే లక్ష రూపాయలు ఇవ్వాల్సిందేనంట. ఫిబ్రవరి, మార్చి నెలల్లో మన డిఇఓకు మంచి సీజన్. ఎందుకంటే స్కూల్స్ వార్షికోత్సవాలన్నీ జరిగేది అప్పుడే! ప్రైవేట్ స్కూల్స్ వార్షికోత్సవాలకు ఎగేసుకుంటూ గెస్టుగా వెళతాడు డిఇఓ... కాని ఒక్క జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవంలోనన్నా ఈయన ముఖ్యఅతిథిగా పాల్గొన్న దాఖలాలున్నాయా?

ఇన్ని ప్రైవేట్ స్కూల్స్ ఫంక్షన్‌లకు వెళ్లాడు. జిల్లాలోని ఇందుకూరుపేట, కొత్తూరులో జివికె, చిన్మయ మిషన్ కలిసి సంయుక్తంగా సిబిఎస్‌ఇ సిలబస్‌తో జివికె చిన్మయ విద్యాలయను నిర్మించారు. దీని ప్రారంభోత్సవానికి డిఇఓను అతిథిగా పిలిస్తే, రెమ్యూనరేషన్ ఇవ్వలేదనేమో... దానికి ఎగ్గొట్టారు. జిల్లాకు సేవాదృక్పథంతో వాళ్లు ఇంటర్నేషనల్ స్కూల్‌ను తెస్తే, దానిని ప్రోత్సహించి, చేయూతనందించాల్సిన డిఇఓ ఇలా గైర్హాజరవ్వడం విద్యాశాఖ అభివృద్ధి పట్ల ఆయనకున్న నిర్లక్ష్య భావానికి అద్దం పడుతుంది.

గతంలోనూ జిల్లా డిప్యూటీ డిఇఓగా ఆయన వెలగబెట్టారు. అప్పుడే ఆయనపై లెక్కలేనన్ని ఆరోపణలు వచ్చాయి. ఉపాధ్యాయులను, ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులను వేధిస్తున్నాడంటూ ఉపాధ్యాయ సంఘాలు దుమ్మెత్తిపోసాయి. రంగనాయకులపేటలోని సెయింట్ పీటర్ స్కూల్‌ను తన చీకటి, అరాచకాలకు అడ్డాగా మార్చుకున్నారంటూ మీడియాలో సైతం వార్తలొచ్చాయి. ఎంతోమంది ఉపాధ్యాయులను మానసికంగా వేధించాడు. ఇక్కడనుండి బదిలీ అయ్యాక కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో పదోన్నతి వచ్చి డిఇఓగా పనిచేసాడు. అక్కడా ఇదే చెడ్డపేరు... అక్కడ నాయకులు తన్ని తరిమేసేసరికి మళ్లీ నెల్లూరు మీదపడ్డాడు. ఈయన వచ్చినప్పటి నుండి విద్యాశాఖలో వివాదాలే! ఉపాధ్యాయుల ఆందోళనలే! డిఇఓగా వచ్చాక ఈయన ఉద్ధరించింది కూడా ఏమీ లేదు. పదోతరగతి ఫలితాలు చూస్తే గత ఏడాది 15వ స్థానం. ఈ ఏడాది కూడా అదే స్థానం. కొంచెం కూడా పురోగతి లేదు. ఉపాధ్యాయుల కౌన్సిలింగ్‌లో వివాదాలు... ఉపాధ్యాయ సంఘాలతో గొడవలు... ఈయనను ఇక్కడ నుండి పంపించేయాలంటూ ఉపాధ్యాయ సంఘాలు ఎప్పటినుండో డిమాండ్ చేస్తున్నాయి. మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కూడా ఈయన పనితీరు నచ్చడం లేదని తెలిసింది. కాకపోతే వైకాపా నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యంలు ముప్పా రామలింగంకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు కాబట్టి, వాళ్లు అడిగింది ఎందుకు చేయాలనే పంతంతోనే మంత్రి డిఇఓ అరాచకాలను చూస్తూ కూడా చూడనట్లు వదిలేస్తున్నారు.

కాని ఇప్పటికైనా ఈ డిఇఓను సాగనంపకపోతే ముమ్ముందు విద్యాశాఖలో మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి.

- మాగుంట లే అవుట్‌లో...

# "SAMSUNG షోరూమ్"

అతిపెద్ద వ్యాపార కూడలిగా రూపుదిద్దుకుంటున్న మాగుంట లేఅవుట్ మెయిన్‌రోడ్డులో యస్.వి.ఆర్. ఏజన్సీస్ తమ సామ్‌సంగ్ షోరూమ్‌ని "యస్.వి.ఆర్ ఎలక్ట్రానిక్ సిటీ" పేరుతో ప్రారంభించబోతుంది. సాంసంగ్ కంపెనీకి చెందిన అన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు ఈ షోరూమ్‌లో లభిస్తాయి.

జూన్ 2 ఆదివారం ఉదయం నెల్లూరు రూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి, నగర యం.యల్.ఎ శ్రీధరకృష్ణారెడ్డి, మాజీమేయర్ భానుశ్రీలతో పాటు సాంసంగ్ కంపెనీ ప్రతినిధులు జితేందర్ జోత్వాని, సూర్యనారాయణ, రితీష్ శ్యాం సుందర్‌లు ప్రత్యేక అతిథులుగా పాల్గొనే ఈ కార్యక్రమంలో ప్రత్తి రవీంద్రబాబు తొలి కొనుగోలును చేస్తాడు.

ఎలక్ట్రానిక్ ప్రియుల కోసం అత్యాధునిక వసతులతో మాగుంట లేఅవుట్ వాసులకి అతిదగ్గరలో ఈ షోరూమ్‌ని అందుబాటులోకి తెస్తున్నట్లు సంస్థ సారధి యస్.వి.సురేష్ తెలియజేశాడు. అందరూ పాల్గొని సంస్థని ఆశీర్వదించవలసిందిగా కోరుతున్నాడు.

# M.A.K కి మరో అవార్డు



అతిథ్యరంగంలో తనదైన ముద్రవేసుకుని భారతప్రధానమంత్రిచే పురస్కార ప్రశంసలను పొందిన మ్యాక్ ప్రోజక్ట్స్ అధినేత ఆదాల మురళీకృష్ణారెడ్డి తన ప్రతిభకు గుర్తుగా మరో ప్రతిష్ఠాత్మక అవార్డును ఇటీవల అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీటవేస్తూ తమ "బన్‌యాన్‌ట్రీ రిట్రీట్" ప్రాజెక్టును అత్యంత అందంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దినందుకుగానూ మురళీకృష్ణారెడ్డిని "టివి-5 బిజినెస్ లీడర్ అవార్డు" వరించింది.

ప్రాజెక్ట్ మొత్తం అత్యంత ఆహ్లాదకరంగా సుందరనందన బృందావనంలా తీర్చిదిద్ది పర్యావరణానికి ప్రాధాన్యతను కల్పించినందుకు గాను అభినందిస్తూ మురళీకృష్ణారెడ్డిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు.


మలేషియాకి చెందిన ఇంజనీరింగ్ నిపుణులచే డిజైన్ చేయబడిన ఈ "బన్‌యన్ ట్రీ రిట్రీట్" ప్రకృతి ప్రేమికులని విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా ఈ ప్రశంసాపురస్కార అవార్డును ఆదాల మురళీకృష్ణారెడ్డి అందుకున్నారు.

నాణ్యతకు, నమ్మకానికి ప్రతీకగా నిలుస్తూ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్న ఆదాల మురళీకృష్ణారెడ్డికి 'లాయర్' అభినందనలు.

PDF Compressor Free Version






## చంద్రబాబు చెప్పింది కరెక్ట్

అవినీతి, నల్లధనాన్ని అరికట్ట డానికి 500, 1000రూపాయల నోట్లను అరికట్టాలని చంద్రబాబు నాయుడు సూచించింది కరెక్టే! వీటిని నిషేధిస్తే దొంగనోట్లను కూడా అరికట్టవచ్చు. పెద్దనోట్లు లేనప్పుడు భారీస్థాయి నగదు లావాదేవీలు జరపాలంటే ఇబ్బందులు తప్పవు. చిన్ననోట్లను లెక్కపెట్టాలంటేనే పెద్ద ప్రయాస. వెయ్యి రూపాయలు దాటిన ప్రతి లావాదేవీకి చెక్కు రూపంలో చెల్లింపులు జరిగేలా చూస్తే ఏ సమస్యా వుండదు.

జి.యస్.రెడ్డి, నెల్లూరు.

## గుడ్డిగా వ్యతిరేకించొద్దు

దేశానికి నరేంద్రమోడీ నాయకత్వం కావాలని ఎక్కువశాతం మంది ప్రజలు కోరుకుంటున్నారు. అమెరికాలో మాదిరిగా మన దేశంలో కూడా అధ్యక్షఎన్నికలు పెడితే నరేంద్ర మోడీ గెలవడం ఖాయం. పనిచేయగల సత్తా వున్న నాయకుడు. నిర్ణయాలు తీసుకోవడంలో స్థిరచిత్తం వున్నోడు. ఉగ్రవాదం వంటి విషయంలో దృఢ నిర్ణయాలు తీసుకోగలడు. ఆయన అభివృద్ధి ప్రణాళికలు దేశ భవిష్యత్‌కు బాటలు వేయగలవు. కొంతమంది ఆయనను గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారు. మతవాద ముద్ర వేసి ఆయనను దూరంగా పెడుతున్నారు. ఒక హిందువుగా హిందువులకు ప్రాధాన్యతనిస్తే తప్పేంటి. నేటి పరిస్థితులలో ప్రజల మద్దతు వుందా లేదా అన్నదే ముఖ్యం.

సి.రాజీవి, నెల్లూరు.

## ఒకరి కోసం దేశమా?


దేశంలో అన్ని ప్రధాన వ్యవస్థలు కూడా సోనియాగాంధీ కుటుంబం కోసమే పనిచేస్తున్నట్లున్నాయి. సోనియాగాంధీకి అయినవారికొక న్యాయం, కానివారికొక న్యాయం అన్నట్లుగా ప్రభుత్వ సంస్థలు వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా సిబిఐ కాంగ్రెస్‌కు ఏజన్సీలాగా పనిచేస్తుంది. జగన్ మీద సోనియా కక్ష పట్టింది. సోనియా పగను చల్లార్చడం కోసమే సిబిఐ పని చేస్తున్నట్లుంది.

వి.కొండారెడ్డి, పామూరు.

# 'ప్రభా'తం

చత్తీష్‌గఢ్... మధ్యప్రదేశ్ నుండి విడిపడ్డ ఓ చిన్న రాష్ట్రం. ఎన్డీఏ హయాంలో ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలను చీల్చి ఉత్తరాంచల్, జార్ఖండ్, చత్తీష్‌గఢ్ రాష్ట్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. చత్తీష్‌గఢ్ అనే చిన్న రాష్ట్రం అవతరించాక ప్రజలకు ఏం మేలు జరిగిందో ఏమోగాని మావోయిస్టులకు మాత్రం ఆ రాష్ట్రం పెద్ద అడ్డాగా మారింది.

మావోయిస్టులే కొన్ని జిల్లాల్లో సమాంతర ప్రభుత్వాలు నడిపే పరిస్థితి ఏర్పడింది. కొన్నిసి సందర్భాలలో పోలీసులకంటే కూడా మావోయిస్టులదే పైచేయి కాసాగింది. దంతేవాడలాంటి జిల్లాల్లో అయితే మావోయిస్టులు జైలు మీద దాడి చేసి ఖైదీలను తప్పించిన సంఘటనలు కూడా వున్నాయి. మావోయిస్టులను ఎదుర్కోవడంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైన తరుణంలో కేంద్ర పారామిలటరీ దళాలే ఇక్కడ మావోయిస్టుల వేట కొనసాగిస్తున్నాయి. అయితే ఇక్కడ దండకారణ్యంలో అణువణువు మావోయిస్టుల అదుపులో వుంటుంది. మందుపాతరలు పేల్చడంలోగాని, మాటువేసి శత్రువులను అంతమొందించే గెరిల్లా పోరాటంలో గాని ఇక్కడి మావోయిస్టులు రాటుదేలారు. కాబట్టి ఇక్కడ మావోయిస్టులను అణచడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కత్తిమీద సాములా మారింది.



## నరమేధం

చత్తీష్‌గఢ్ నరమేధం మన పోలీసు ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. మావోయిస్టులు కొట్టిన దెబ్బకు రాజకీయ నాయకుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్నాయి. హింసకు ప్రతిహింస పంథాను ప్రభుత్వాలే ప్రోత్సహించడం వల్ల ఏర్పడిన అనర్థమే చత్తీష్‌గఢ్ ఘటన. దీనిపై లోతుగా విశ్లేషణ జరగాల్సివుంది.

చత్తీష్‌గఢ్‌లో మావోయిస్టుల నరమేధం తారాస్థాయికి చేరింది. మే 25వ తేదీన దక్షిణ బస్తర్ ప్రాంతంలోని సుకుమా జిల్లాలో మందుపాతరలతో మావోయిస్టులు జరిపిన దాడిలో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మ, పీసీసీ అధ్యక్షుడు నందకుమార్‌పటేల్, ఆయన కుమారుడితో పాటు 30మంది దాకా మృత్యువాతపడ్డారు. మాజీకేంద్రమంత్రి వి.సి.శుక్లా తీవ్రగాయాల పాలై మృత్యువుతో పోరాడుతున్నారు. మాజీముఖ్యమంత్రి అజిత్‌జోగి తృటిలో ముప్పునుండి తప్పించుకున్నారు.

చత్తీష్‌గఢ్ అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ రాష్ట్రంలో ఇప్పటికే రెండుసార్లు అధికారానికి దూరమైన కాంగ్రెస్‌పార్టీ ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని తపిస్తూ రాష్ట్రంలో పరివర్తన్ యాత్రను చేపట్టింది. సుకుమా జిల్లాలో పరివర్తన్ యాత్రను పూర్తిచేసుకుని కాంగ్రెస్ నాయకులు తిరిగి వస్తుండగా మావోయిస్టులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ యాత్రలో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మ వున్నాడని తెలుసుకున్న మావోయిస్టులు ఆయననే లక్ష్యంగా చేసుకుని ఈ దాడి నిర్వహించారు. దాదాపు 150మంది మావోయిస్టులు ఈ దాడిలో పాల్గొని తమ పంతాన్ని నెరవేర్చుకున్నారు. మహేంద్రకర్మను అంతమొందించాక మావోయిస్టులు నృత్యాలు చేసారంటే ఆయనపై వాళ్ల ఎంత కసితో రగిలిపోయారో అర్థమవుతుంది. మహేంద్రకర్మ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు. అజిత్‌జోగి ప్రభుత్వంలో ఆయన పరిశ్రమలశాఖ మంత్రిగా కూడా పని చేసారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా కూడా కొనసాగారు. చత్తీష్‌గఢ్‌లోని బస్తర్, దంతేవాడ జిల్లాలు వనరులపరంగా సంపన్నమైనవి. కాని అభివృద్ధిపరంగా ఎంతో వెనుకబడి వుండేవి. 1990వరకు ఈ రెండు జిల్లాలపై మావోయిస్టుల పట్టు వుండేది. ఇక్కడి గిరిజనులు మావోయిస్టులను నమ్మేవాళ్లు. కాలక్రమంలో గిరిజనుల్లోని ఒక తెగ మావోయిస్టులకు వ్యతిరేకంగా వ్యవహరించసాగింది. గిరిజనుల్లో పెత్తందారీవర్గానికి చెందిన మహేంద్రకర్మ 1991లో 'జన్‌జాగరణ్ అభియాన్' అనే ఉద్యమాన్ని స్థాపించారు. కాని ఆదివాసీల మద్దతు కూడగట్టలేక అది విఫలమైంది. చత్తీష్‌గఢ్‌లో ఖనిజాల తవ్వకం కోసం కొన్ని కంపెనీలు టెండర్లు వేసాయి. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికీకరణ దిశగా గనులను కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేయగా, గిరిజన గ్రామాలకు దానివల్ల ముప్పువస్తుందంటూ మావోయిస్టులు వ్యతిరేకించారు. పారిశ్రామికీకరణ వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసింది. దీనిని అవకాశంగా తీసుకున్న మహేంద్రకర్మ 2005లో సల్వాజుడుంను ప్రారంభించారు. గిరిజన యువకులను అందులో చేర్చి జీతాలిచ్చారు. మావోయిస్టు సానుభూతిపరుల మీద దౌర్జన్యాలు చేయించారు. సల్వాజుడుం కార్యకర్తలచేత గిరిజన గ్రామాలను ఖాళీచేయించారు. పాఠశాలలను ఆక్రమించుకుని సల్వాజుడుం క్యాంప్‌లను ఏర్పాటుచేసారు. మావోయిస్టులకు, సల్వాజొడుంకు మధ్య దాడులు, ప్రతిదాడుల్లో అమాయకులైన ప్రజలు బలయ్యారు. పౌరహక్కుల సంఘాలు సుప్రీంకోర్టులో కేసువేసాయి. సుప్రీం సల్వాజుడుంను నిషేధించాలని ఆదేశించింది. తీవ్రవాదంపై సమరానికి స్థానిక ప్రజలనే ఉపయోగించుకోవాలన్న రాష్ట్ర ప్రభుత్వ అతితెలివి నిర్ణయానికి రాష్ట్రం భారీమూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుంది.

2009లో చత్తీష్‌గఢ్‌లోనే మావోయిస్టులు ఇలాగే మెరుపుదాడి చేసి 62మంది జవాన్లను బలిగొన్నారు. మళ్లీ ఈ భయంకర దాడితో మావోయిస్టులు ఎంతగా పెరిగిపోయారో తెలిసొస్తుంది.

సీమాంతర ఉగ్రవాదం, దేశీయ తీవ్రవాదం... ఈ రెండూ దేశానికి ప్రమాదకరమే! సీమాంతర ఉగ్రవాదాన్ని నిర్మూలించాలంటే 'కన్నుకు కన్ను' సిద్ధాంతాన్ని అనుసరించకతప్పదు. కానీ దేశీయ తీవ్రవాదం నిర్మూలనకు పలు మార్గాలున్నాయి. హింసకు ప్రతిహింస అనే పద్ధతిలో కాకుండా సామాజిక కోణంలో ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించాల్సి వుంది.

## 'అంతర్'జాతీయం

- చైనా మళ్ళీ హద్దు దాటింది. జమ్మూ-కాశ్మీర్‌లోని లడఖ్ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ వైపు పెట్రోలింగ్‌కు పోకుండా భారత సైన్యాన్ని అడ్డుకుంది. ఎల్‌ఏసిలో దాదాపు 5కిలోమీటర్ల మేర సిరిజాప్ ప్రాంతం క్రిందకు వచ్చే ఫింగర్-4 వరకు చైనా ఓ రోడ్డు నిర్మించింది. ఈ ప్రాంతం తమదేనని చైనా వాదిస్తుండగా, ఇది లడఖ్‌లో అంతర్భాగమని భారత్ పేర్కొంది. చైనా ప్రధాని భారత పర్యటన విజయవంతమైందని ఆనందిస్తున్న తరుణంలో ఈ సంఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరం.
- 14ఏళ్ల శిక్ష పూర్తయినంతమాత్రాన ఖైదీని విడిచిపెట్టాలని లేదని సుప్రీం కోర్టు పేర్కొంది. యావజ్జీవశిక్ష అంటే జీవితాంతం జైలులో వుండడమేనని పేర్కొంది. నేరతీవ్రతను బట్టి శిక్షను తగ్గించే అధికారం రాష్ట్రపతి, గవర్నర్లకు మాత్రమే వుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.
- ఐపిఎల్-6 ఛాంపియన్‌గా ముంబై ఇండియన్స్ నిలిచింది. ఆదివారం కలకత్తాలోని ఈడెన్‌గార్డెన్స్‌లో జరిగిన ఫైనల్స్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌పై 23పరుగుల తేడాతో విజయం సాధించి తొలిసారి ఐపిఎల్ టైటిల్‌ను గెలుచుకుంది.
- బీసీసీఐ ఛైర్మన్ పదవికి తాను రాజీనామాచేసే ప్రసక్తేలేదని శ్రీనివాసన్ స్పష్టం చేశారు. స్పాట్‌ఫిక్సింగ్ ఉదంతంలో తన అల్లుడు గురునాథ్ నిందితుడైతే తానెందుకు రాజీనామా చేయాలని, తప్పుచేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని అన్నారు.
- భారత మాజీరాష్ట్రపతి అబ్దుల్‌కలాంకు అమెరికాకు చెందిన జాతీయ రోదసీ సంస్థ ప్రతిష్టాత్మక "ఐర్నర్‌వాన్ బ్రూన్ మెమోరియల్ అవార్డు"ను ప్రదానం చేసింది.
- భారత ప్రధాని మన్మోహన్‌సింగ్ సతీసమేతంగా మూడురోజులు జపాన్‌లో పర్యటించారు. జపాన్ ప్రధాని షింజో అబెతో అణుఒప్పందం, ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు.
- హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత ఉపఖండం భద్రతను మరింత పటిష్టం చేసేలా దక్షిణ భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రం తంజావూరులో ఏర్పాటు చేసిన తొలి సుఖోయ్ యుద్ధవిమాన స్థావరాన్ని సోమవారం రక్షణశాఖ మంత్రి ఏ.కె.ఆంటోని ప్రారంభించారు. ఈ స్థావరంలో 2017-18నాటికి 16 నుండి 18వరకు ఎస్‌యు30 ఎంఐకె యుద్ధ విమానాల పూర్తి దళాన్ని మోహరించనున్నట్లు ఈ సందర్భంగా రక్షణమంత్రి వెల్లడించారు.
- బెదిరింపులతో తనను లొంగదీసుకోలేరని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ యూపిఏ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిబిఐని బూచిగా చూపి తమను బెదిరించేవారికి తగిన బుద్ధి చెబుతామన్నారు. కేంద్రానికి దమ్ముంటే తమ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని సవాల్ విసిరారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పుతా. - చంద్రబాబు.
వ్యాఖ్య :- ***రాష్ట్ర రాజకీయాలలో తిరగడం లేదనా?***

వార్త :- ప్రజాసమస్యలు పట్టని కిరణ్ సర్కార్. - షర్మిల.
వ్యాఖ్య :- ***ఆ సర్కార్‌కు సొంత మంత్రుల సమస్యలే పట్టడం లేదు.***

వార్త :- ఫిక్సింగ్ నిరోధానికి కొత్త చట్టం. - కేంద్రమంత్రి కపిల్ సిబల్.
వ్యాఖ్య :- ***ఐపిఎల్‌నే నిషేధిస్తే ఏ సమస్యా వుండదు కదా?***

వార్త :- 30ఏళ్లుగా పార్టీ నేతలను పశువులుగానే చూసారా? - బాబుపై దాడి ధ్వజం.
వ్యాఖ్య :- ***బానిసలుగా చూసాడనే సంగతి లోకానికి తెలుసు. పశువుల సంగతి మాత్రం తెలియదు.***

వార్త :- వీరిక మాజీలే. - ధర్మాన, సబితల రాజీనామాలకు గవర్నర్ ఆమోదం.
వ్యాఖ్య :- ***కొద్దిరోజులన్నా ప్రశాంతంగా వుంటారు.***

వార్త :- పాదయాత్రలతో పాపాలు ప్రక్షాళన కావు. - చంద్రబాబుపై కిరణ్ ధ్వజం.
వ్యాఖ్య :- ***దానికంటే తీర్థయాత్రలతో ఫలితముంటుందంటారా?***

వార్త :- బాబుకు ఇదే ఆఖరి మహానాడు. - ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి.
వ్యాఖ్య :- ***ఆయన జాతీయ రాజకీయాల్లోకి పోతున్న విషయం మీకూ తెలుసా!***

వార్త :- మావోయిస్టులు వచ్చే అవకాశముంది. - డిజిపి దినేష్‌రెడ్డి.
వ్యాఖ్య :- ***వాళ్లకు ఆ ఉద్దేశ్యం లేకున్నా మీరు రమ్మన్నట్లుగా వుంది.***

వార్త :- టీడీపీలో స్వార్థపరులున్నారు. - బచ్చయ్యచౌదరి.
వ్యాఖ్య :- ***రాజకీయనాయకులంటేనే స్వార్థపరులు...?***

వార్త :- నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు. - సీఎంపై మాజీమంత్రి శంకర్‌రావు ఆరోపణ.
వ్యాఖ్య :- ***ఆయన అంత పని పాటా లేక ఖాళీగా వున్నారా?***

వార్త :- మీరు తీసుకున్న గోతిలో మీరే పడ్డారు. - మంత్రులపై విజయమ్మ విమర్శ.
వ్యాఖ్య :- ***రాజకీయాల్లో అది రొటీన్ కదమ్మా!***

PDF Compressor Free Version



లాయర్
జాతీయ వారపత్రికకు
32వ వార్షికోత్సవ శుభాకాంక్షలతో...



- Schools
- Junior Colleges
- Coaching Centers
- Professional Colleges
- Civil Services
- Co-programme



Dr. P. Narayana
Founder and Chairman

SRAMAYEVA JAYATHE
THE NARAYANA GROUP
NARAYANA
group of educational institutions

# నెల్లూరుజైలులో గందరగోళం

## ఆందోళనకు దిగిన ఖైదీలు

నెల్లూరు కేంద్ర కారాగారం మరోసారి వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. జైలు సూపరింటెండెంట్ వైఖరిని నిరసిస్తూ ఓపెన్ ఎయిర్‌జైలులోని ఖైదీలు భోజనం చేయకుండా నిరసన వ్యక్తంచేసిన ఘటన మరువకముందే మరోసారి కేంద్ర కారాగారంలో ఖైదీలు అధికారుల తీరుపై ఆందోళనకు దిగారు.

వివరాల్లోకి వెళితే... కడపజిల్లాకు చెందిన 15మంది జీవిత ఖైదీలను ప్రత్యేక దండన నిమిత్తం నెల్లూరుజిల్లా కేంద్ర కారాగానికి తరలించారు. ఇక్కడ కూడా ఆ ఖైదీల్లో మార్పురాక జిల్లా జైల్లో వివాదం రేపి గందరగోళం సృష్టించారు. 15మంది ఖైదీలు ఒక వర్గంగా ఏర్పడి అక్కడ జైల్లో మిగిలిన ఖైదీలపై దాడులకు పాల్పడడం, జైలు అధికారులపై జిల్లా అధికారులకు తప్పుడు పిర్యాధులు చేయడం వంటి కార్య కలాపాలకు పాల్పడుతుండడంతో రాయలసీమ రేంజ్ జైళ్ళశాఖ డిఐజి జయవర్ధన్ నెల్లూరు జైలుకు తరలించారు. ఇక్కడ కూడా జైల్లో సరైన సౌకర్యాలు లేవని, ఖైదీలతో గొడవపడడం తమను కడప జైలుకే తరలించాలని జైలు అధికారులతో గొడవలకు దిగడం మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో గణేష్ అనే ఖైదీకి అనారోగ్యం చోటు చేసుకోవడంతో జైలు అధికారులు అతన్ని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి ఆదివారం నెల్లూరు జైలుకు తీసుకు వచ్చారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మిగిలిన 14మంది ఖైదీలు జైల్లో సౌకర్యాలు సరిగా లేకపోవడంతోనే ఖైదీ గణేష్ అనారోగ్యానికి గురయ్యాడంటూ వివాదం లేపారు. జిల్లా కలెక్టర్‌ను పిలిపిస్తే తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తామని జైలు అధికారులను కోరారు. దీనికి జైలు అధికారులు నిరాకరించడంతో 14మంది ఖైదీలు సోమవారం ఉదయం అల్పాహారం తీసుకోకుండా నిరసన వ్యక్తం చేసారు. అంతేగాక జైలు అధికారులు ఖైదీలపై దాడికి పాల్పడ్డారని గొడవరేవడంతో జిల్లా కేంద్ర కారాగారం వద్ద గందరగోళం నెలకొంది. పలువురు ఖైదీల బంధువులు, సిపియం పార్టీ నాయకులు జైలు వద్దకు చేరుకున్నారు.

అయితే జైల్లో ఎటువంటి గొడవలు జరగలేదని జైలు అధికారులు వివరణ ఇచ్చారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

## 860కోట్లతో భూగర్భ డ్రైనేజి

నెల్లూరు నగరంలో దాదాపు 860 కోట్లతో త్వరలో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎసీకూరగాయల మార్కెట్ సమీపంలోని కోనేటిస్థలంలో కోటి రూపాయలుతో నిర్మించిన ఎసీ సుబ్బారెడ్డి రిటైల్ మార్కెట్ మూడుషెడ్లను మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ నగర దాహార్తిని తీర్చేందుకు సంగం నుంచి నెల్లూరుకు పైపులైన్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేసేందుకు 460కోట్ల రూపాయలు ఖర్చుకాగల పథకం త్వరలో రూపుదాల్చబోతోందన్నారు. గ్రామాల నుంచి చిన్న రైతులు గంపల్లో ఆకుకూరలు, కూరగాయలను తెచ్చి రోడ్డుమార్జిన్‌లో వ్యాపారం నిర్వహిస్తుండడంతో తరచుగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేదన్నారు. లబ్ధిదారుల జాబితాను తయారుచేసామని వీరికి లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దుకాణాల కోసం ఎవ్వరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా వసూళ్ళకు పాల్పడినట్లు తమ దృష్టికిగాని, మార్కెట్టు అధికారుల దృష్టికి తీసుకొస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆనం వివేకానందరెడ్డి, ఎన్‌డిసిసి బ్యాంకు ఛైర్మన్ ధనుంజయరెడ్డి, డిసిసి ఇన్‌చార్జి అధ్యక్షుడు చాట్ల నరసింహారావు, ఏఎంసిమార్కెట్టు డైరెక్టర్ శ్రీనివాస్, ఏడి గౌస్‌బాష, ఆర్డీఓ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలతిక్రమిస్తే కఠినచర్యలు

### డ్వామా పిడి గౌతమి

ఇసుక రీచ్‌ల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని డ్వామా పిడి ఎం.గౌతమి కాంట్రాక్టర్లను హెచ్చరించారు. మంగళవారం డ్వామా కార్యాలయంలో అధికారులు, ఇసుకరీచ్‌ల కాంట్రాక్టర్లుతో నిర్వహించిన సమావేశంలో గౌతమి మాట్లాడుతూ నిబంధనల మేరకు ఇసుక విక్రయించాలన్నారు. వేబిల్లులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రీచ్‌ల్లో ట్రాక్టర్లును మాత్రమే వినియోగించాలని, జేసిబి, ఇతర యంత్రాలు వినియోగిస్తే కేసులు నమోదు చేసి కాంట్రాక్టును రద్దు చేస్తామని హెచ్చరించారు. వేబిల్లులపై విచారణ జరిపించేందుకు ఆర్ఐని నియమిస్తామన్నారు.


● వడదెబ్బకు బాప్‌రే అంటుంటే...

## కూరగాయల ధరలు... చుక్కలు చూపిస్తున్నాయ్



మునుపెన్నడూ లేని విధంగా సూర్య భగవానుడు కన్నెర్రజేయడంతో జనాలు మలమల మాడిపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే ఏకంగా ప్రాణాలకే గండం ఏర్పడుతుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నెల్లూరులో 45సెంటీగ్రేడు వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనిష్టంగా 30డిగ్రీలకు తగ్గడం లేదు. రోడ్డుమీద నడుస్తున్నా, ఇంట్లో వున్నా వడమర్గాలులు వేడిగా ముఖాలను మాడ్చేస్తున్నాయి. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనివుంది. కొబ్బరిబోండాలు ధరలు పైకెక్కి కూర్చున్నాయి. ఇండ్లలో ఏసిల మోత పెరిగింది. జిల్లావ్యాప్తంగా వడదెబ్బకు చాలామంది చనిపోయారు.

ఇక కూరగాయల విషయానికొస్తే ఎండలతో పోటీపడి చుక్కలు చూపిస్తున్నాయి. నీళ్లులేక సాగు, దిగుబడులు తగ్గిపోయాయి. ఫలితంగా ఒక్కసారిగా కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. పేద మధ్యతరగతి ప్రజలకు కూరగాయల ధరలు వింటుంటే గుండెల్లో దడ వస్తుంది. తప్పనిసరి పరిస్థితుల్లో కొద్దిగా కొనుక్కొని పూట గడుపుకుంటున్నారు. పదిరోజుల క్రింద ఒకటిన్నర కిలోల టమోటా కేవలం పదిరూపాయలకే దొరికేవి. ప్రస్తుతం టమోటా ధర కేజీ రూ. 50లకు అమ్ముతున్నారు. సరకు తక్కువగా ఉండటం, రవాణాఛార్జీలు పెరగడంతో ఈ ధరల మోత మోగుతుంది. అల్లం కెవ్వుకేక అంటోంది. కిలోధర రూ.200లు పలుకుతోంది. కూరగాయలన్నీ ఆకాశంలో చుక్కలు చూపిస్తున్నాయి.



PDF Compressor Free Version





## నెల్లూరు కబుర్లు



# అన్నపై మంత్రి రుసరుస

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిపై ఆయన తమ్ముడు ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్రంగా కోప్పడుతున్నట్లు తెలుస్తుంది. దీనికి కారణం వివేకా తిరుగుడే! వివేకా అనారోగ్యంతో ఆరు నెలలు హైదరాబాద్‌లో మంత్రి రామనారాయణరెడ్డి ఇంట్లోనే వున్నాడు. వివేకాను వేరే ఇంట్లో వుంచితే ఆరోగ్యం బాగాలేకున్నా కూడా ఆయన సిగరెట్లు కంట్రోల్ చేయడం కష్టమని మంత్రి తన పర్యవేక్షణలోనే వుంచారు. వివేకా ఆరోగ్యం మీద కుటుంబసభ్యులు ఎంతో ఆందోళన చెందారు. ఆనం సోదరుల బిడ్డలందరు కూడా వివేకాను ఒక చిన్నబిడ్డలా శ్రద్ధ తీసుకుని చూసారు. వివేకా త్వరగా కోలుకోవాలని వారంతా ప్రార్థించారు. అయితే వివేకా కోలుకుంటే మళ్లీ తిరగడం ఆపడని కూడా అనుకున్నారు. వాళ్లనుకున్నట్లే వివేకా నెల్లూరు రావడంతోటే తిరుగుళ్ళు మొదలుపెట్టాడు. ఆరు నెలలుగా తాను కోల్పోయిన దానిని కవర్ చేసుకునే పనిలో ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట కార్యక్రమం పెడుతున్నాడు. వివేకా తిరుగుడు చూసి... మళ్ళీ ఆయనకేమన్నా అవుతుందేమోనని, ఆయన కొంతకాలం విశ్రాంతి తీసుకోవచ్చు కదా అనేది మంత్రి బాధ.

# అపార్ట్‌మెంట్లలో ఆందోళన

నెల్లూరు దర్గామిట్టలో శబరి రామక్షేత్రం పక్కన పాత యం.జి.బ్రదర్స్ షోరూం స్థలంలో భారీ మల్టీప్లెక్స్ నిర్మాణం జరుగుతుంది. ఈ భారీ కట్టడంలో వివిధ షాపింగ్‌మాల్స్‌తో పాటు 4థియేటర్లు కూడా వుండబోతున్నాయి. ఇంతపెద్ద మల్టీప్లెక్స్ కాంప్లెక్స్‌కు పార్కింగ్ సమస్య రాకుండా వుండాలంటే ఖచ్చితంగా డబుల్ సెల్లార్ వుండాలి. దీని కోసం వాళ్లు దాదాపు 35అడుగుల మేర మట్టి తవ్వారు. ఇప్పుడక్కడ చూస్తే అదో మినీ ఓబుళాపురం మైనింగ్ గనిలా వుంది. ఇంత లోతున అక్కడ తవ్వడంతో పక్కనేవున్న అపార్ట్‌మెంట్స్ వారు ఆందోళనకు దిగుతున్నారు. ఈ లోతైన గోతి వల్ల తమ అపార్ట్‌మెంట్లు ఎక్కడ కూలుతాయోననేది వారి ఆందోళన! ఇంజనీరింగ్ నిపుణులే ఈ సమస్యను చూసి పరిష్కరించాల్సి వుంది.

# పోలీసులకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ కాంప్లిమెంట్స్



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎస్పీ బి.వి.రమణకుమార్

క్రికెట్ బెట్టింగ్ మాఫియాపై ఉక్కుపాదం మోపిన జిల్లా పోలీసులకు నెల్లూరు జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు అభినందనలు తెలిపారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్, నగర డిఎస్పీ పి.వెంకటనాథ్‌రెడ్డితో పాటు నగర సిఐలు, బాలాజీనగర్ ఎస్ఐను సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుమారు 100మంది బుకీలు, పంటర్లను అరెస్ట్ చేశామన్నారు. ప్రధాన నిందితుడు కృష్ణసింగ్ కోసం గాలిస్తున్నామన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు మాట్లాడుతూ బెట్టింగ్ మాఫియా నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు తమవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. అనంతరం నెల్లూరు నగరంలోని, 1,2,3,5,6నగర సిఐలు మద్ది శ్రీనివాసులు, ఎన్.కోటారెడ్డి, కె.వి.రత్నం, ఎస్.వి.రాజశేఖర్‌రెడ్డి, జి.మంగారావు, ఎస్ఐ నాగేశ్వరరావులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, వొమ్మిన సుబ్రహ్మణ్యం, వొమ్మిన సతీష్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదిగా నల్లబట్టలే!



జగన్ జైలు నుండి బయటకొచ్చే వరకు తాను నల్లబట్టలే వేసుకుంటానని నెల్లూరు నగర వైసిపి సమన్వయకర్త పి.అనిల్ కుమార్‌యాదవ్ ప్రకటించి వున్నారు. చెప్పినట్లే నల్లచొక్కా, నల్లప్యాంట్ ధరిస్తున్నాడు. జగన్ జైలు జీవితం ఏడాది గడిచింది. అనిల్ నల్లదుస్తుల జీవితం కూడా ఏడాదయ్యింది. జగన్‌కు జైలు నుండి విముక్తి, అనిల్‌కు నల్లబట్టల విముక్తి ఎప్పుడో?

# గోశాలకు మాస్టర్ మైండ్స్ విరాళం



నెల్లూరు నగరంలోని నెహ్రూనగర్ గోశాలకు మాస్టర్‌మైండ్స్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రతి విద్యార్థి ప్రవేశం నుంచి 10రూ॥ల వంతున సేకరించి సంస్థ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ గోశాల నిర్వాహకులకు 1.62లక్షలు ఆదివారం అందజేశారు ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ మానవాళికి మేలు చేసే గోవుల సంరక్షణకు మరింత మంది దాతలు ముందుకు రావాలన్నారు.


# పగలు నిల్... రాత్రి ఫుల్

మాడుతున్న ఎండలు ఓ పక్క... తీరిక లేని వివాహ వేడుకలు మరో పక్క ఎండకు అడుగు బయటపెట్టాలంటే భయం. కాని బంధువులు, మిత్రుల ఇళ్లల్లో శుభకార్యాలు జరుగుతుంటే పోకుండా వుండలేరు కదా! మే నెలలో పెళ్ళిళ్లు ఎక్కువుగా జరిగాయి. దీనికి తగ్గట్లే బస్సులు, రైళ్లలో సీట్ల కోసం ప్రయాణీకులు నానా అగచాట్లు పడ్డారు. ముందుచూపుతో చాలామంది నెలక్రితమే రిజర్వేషన్లు చేసుకున్నారు. రాత్రివేళల్లో వెళ్లే ప్రైవేట్ ఏ.సి.బస్సుల వాళ్లు డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని టిక్కెట్లను సైతం అమాంతం పెంచేసారు. ఆర్టీసీ కూడా స్పెషల్ బస్సులు నడిపి ప్రయాణికుల నుండి అధికఛార్జీలు గుంజింది. కర్ణాటక ఆర్టీసీవాళ్లు సైతం నెల్లూరు నుండి బెంగుళూరుకు స్పెషల్ వోల్వోబస్సులు నడిపారు. అయితే ఇంత రద్దీ సీజన్‌లో కూడా ఎండల దెబ్బకు పగలు పూట వెళ్లే బస్సులు ఖాళీగా కనిపించాయి.

# పేద ప్రతిభకు పురస్కారం



2013 పదో తరగతి పరీక్షల్లో 510మార్కులు పైన సాధించిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల విద్యార్థులకు మేనెల 27న నెల్లూరు దర్గామిట్టలోని నగరపాలకసంస్థ కార్యాలయంలో నెల్లూరు నగర గ్రామీణ శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆనం వివేకానందరెడ్డిల సమక్షంలో జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ నగదు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకంటే ఎక్కువ మంది 510మార్కులు పైన సాధించడం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ విద్యార్థుల ప్రతిభకు మెరుగులు దిద్దిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతిభ చూపిన విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తన అభినందనపూర్వక నమస్కారాలు అందించారు. కార్యక్రమంలో నెల్లూరు కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ సి.హెచ్ పెంచలరెడ్డి, నగర మాజీ మేయర్ భానుశ్రీ, కమీషనర్ శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.



మే నెల 27వ తేదీన నెల్లూరు మద్రాసుబస్టాండ్ వద్ద గల ఆకుకూరల మార్కెట్ సముదాయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆర్డీఓ మాధవీ లత, కాంగ్రెస్ నాయకులు చాట్ల నరసింహారావు, పెండి సురేష్

# ఎన్నికలకు వేళాయెరా...

సింహపురి సమాచారం

ఎన్నికల సీజన్ మొదలు కాబోతుంది. ఈ ఎన్నికల జాతర వచ్చే ఏడాది ఈ నెల వరకు వుండబోతుంది. వరుసబెట్టి ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతుంది. ఇప్పటివరకు ఓటమి భయంతో వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ వచ్చిన ఎన్నికలను ఇక వాయిదా వేయడానికి వీల్లేని పరిస్థితుల్లో ఎన్నికలు జరపడానికే నిశ్చయించుకుంది.

2009 అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ఇక ఏ ఎన్నికలు లేవు. దీనికి కారణం వై.యస్.రాజశేఖరరెడ్డి అకాల మరణమే! ఎందుకంటే ఆయన లేని కాంగ్రెస్‌పార్టీ ఏ ఎన్నికలను ఎదుర్కోవడానికి సాహసించలేక పోయింది. 2004 నుండి 2009 వరకు అసెంబ్లీ, లోక్‌సభ, సహకారం, స్థానిక, శాసనమండలి... ఇలా ఏ ఎన్నికలు వచ్చినా రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఒంటి చేత్తో గెలిపించాడు వై.యస్. 2009 సెప్టెంబర్ 2న ఆయన దివంగతులయ్యారు. ఆయన మరణంతో రాష్ట్ర రాజకీయాలే మారిపోయాయి. కాంగ్రెస్‌పార్టీకి దిక్కు దిశానం లేకుండాపోయింది. ఆ పార్టీని ఎన్నికలలో నడిపించే వాళ్లే లేకుండా పోయారు. ఎన్నికలు జరిగితే ఎక్కడ ఓడి పోతామోనన్న భయంతో మున్సిపల్, పంచాయితీ, సహకారం, జిల్లా పరిషత్ ఎన్నికలను వాయిదాలు వేసుకుంటూ వచ్చారు. ఈ మధ్యనే కొంచెం ధైర్యం చేసి సహకార ఎన్నికలను పెట్టారు. ఇక జూన్ నుండి పంచాయితీ, మున్సిపల్ ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. ఆ వెంటనే జడ్పీ ఎన్నికలను కూడా జరిపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇవన్నీ ముగిసాక ఎలాగూ అసెంబ్లీ ఎన్నికల జాతర మొదలవుతుంది.

వరుసబెట్టి పంచాయితీ, మున్సిపల్, జడ్పీ ఎన్నికలను జరుపడం వెనుక కాంగ్రెస్ పెద్ద వ్యూహమే పన్నింది. ప్రస్తుతం ప్రజలలో జగన్ పాపులారిటీ బాగుంది. దీనిని తగ్గించే మార్గం కూడా లేదు. ఒక్కసారైనా జగన్‌కు ఓటేయాలనే నిశ్చితాభి ప్రాయంతో ప్రజలున్నారు. వరుసబెట్టి ఈ ఎన్నికలు పెట్టేస్తే ప్రజలు జగన్ అభ్యర్థులకు ఓట్లేస్తారు. స్థానిక రాజకీయాల మూలంగా గ్రామాలలో పార్టీల వారీగా గ్రూపులు ఏర్పడతాయి. జగన్ మీద అభిమానమున్నా కూడా ఈ వర్గ రాజకీయాల ప్రభావం ఎన్నికలమీద కొంతవరకన్నా పడుతుంది. జగన్ హవాను కొంతమేర తగ్గించగలరు. కాబట్టే వరుస ఎన్నికలకు శ్రీకారం చుట్టారు.

# దేశభక్తిని చాటుకోండి

## విద్యార్థులకు ఆర్‌సిఐ డైరెక్టర్ సతీష్‌రెడ్డి పిలుపు




సతీష్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు

"హైదరాబాద్ డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్"(ఆర్‌సీఐ) యూనిట్ డైరెక్టర్ అయిన నెల్లూరుజిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరుకు చెందిన జి.సతీష్‌రెడ్డి మే 25న నెల్లూరులో జరిగిన మీట్‌ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ కష్టపడి ఇష్టంగా చదివి ఉన్నతస్థాయికి చేరుకున్న విద్యార్థులు విదేశాలకు వెళ్ళకుండా ఇక్కడే వుండి తమ మేధస్సుతో పరిశోధనలు చేస్తూ స్వదేశాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అలాగే యువత శాస్త్ర సాంకేతిక రంగంలో పరిశోధనలపై దృష్టిపెట్టాలని సూచించారు. ఈరోజు బ్రహ్మోస్, అగ్ని-5, జలక్షిపణి ప్రయోగాలతో మన దేశం అగ్రదేశాల సరసన సగర్వంగా నిలిచిందని తెలిపారు. డిఆర్‌డిఓ నేతృత్వంలో దేశవ్యాప్తంగా 52క్షిపణి ప్రయోగశాలలు వున్నాయని, 2100ఎకరాల్లో విస్తరించివున్న హైదరాబాద్ యూనిట్‌లో దాదాపు వెయ్యిమంది శాస్త్రవేత్తలు పనిచేస్తున్నారని తెలిపారు.

# తెలుగు పాలనతోనే రాష్ట్రానికి వెలుగు సోమిరెడ్డి

తెలుగుదేశంపార్టీతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని తెదేపా రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మే24న తెలుగుదేశంపార్టీ జిల్లా మినీ మహానాడు సమావేశం నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని జిపిఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ముందుగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి జ్యోతి ప్రకాశం చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ వైయస్సార్‌సీపీకి విలువలులేవని, నిలువునా గొంతులు కోస్తుందని డబ్బు సంపాదనే ధ్యేయంగా ఆ పార్టీ పనిచేస్తోందని ఆరోపించారు. గాలి జనార్ధన్ రెడ్డి, జగన్‌ల దోపిడి ఎంతగా జరిగిందంటే ఆంధ్ర, కర్నాటకల మధ్య సుప్రీంకోర్టు సాధికారత సంస్థ సరిహద్దు రెండేళ్ళు నుంచి గుర్తించలేకుందని అంతలా వారు గనులను దోచుకున్నారని దుయ్యపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రం భ్రష్టుపట్టి పోయిందని, ఎక్కడికక్కడ అభివృద్ధి నిలిచిపోయిందని ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. రెండు లక్ష్యాలతో తెలుగుదేశంపార్టీ యుద్ధబరిలోకి దిగుతోందని ఒకటి కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్‌ల అవినీతి గురించి ప్రజలలో ఎండగట్టడం, రెండోది పార్టీని పటిష్టపరుచుకుని అధికారంలోకి తెచ్చుకుని చంద్రబాబునాయుడ్ని ముఖ్యమంత్రిగా చేయడమే నన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే పరసా రత్నం, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సందేశాన్ని పరిశీలకులు చదివారు. అనంతరం 10అంశాలపై తీర్మానం ప్రవేశపెట్టారు.

# మెట్టరైలు పట్టాలెక్కదా?




శ్రీకాళహస్తి - నడికుడి రైల్వేలైన్... మెట్ట ప్రాంతవాసుల 30ఏళ్ళ కల. ఈ కల మనకు శాశ్వతమయ్యేటట్లుంది. ఎందుకంటే ఈ రైల్వేలైన్ బడ్జెట్‌లో ప్రతిపాదనలకు, సర్వేలకు, రాజకీయ నాయకుల వాగ్దానాలకు పరిమితమవుతుంది తప్పితే పట్టాలెక్కడం లేదు. ఇంతవరకు ఈ రైల్వే లైన్ సర్వేలకే పరిమితమైంది. పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిద్దామన్న ప్రయత్నమే కనిపించడం లేదు.

చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలలో దాదాపు 30మండలాల ప్రజలకు ఉపయోగపడే ఈ రైల్వేలైన్ కోసం ప్రతి బడ్జెట్‌లోనూ ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేస్తూనేవున్నారు. 2009లో ముఖ్యమంత్రిగా వున్న కె.రోశయ్య ఈ లైన్ కోసం అప్పటి రైల్వేమంత్రి మమతా బెనర్జీకి లేఖ వ్రాయగా ఆమె 2010 రైల్వేబడ్జెట్‌లో దీనికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ రైల్వేలైన్ సర్వే కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రెండుకోట్లు విడుదల చేయడం జరిగింది. ఎస్ఎం కన్సల్టెన్సీ ఏజెన్సీ చేసిన సర్వేద్వారా 2011లో రూపొందిన అంచనా ప్రకారం శ్రీకాళహస్తి నుండి నడికుడి వరకు 308 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణానికి 1314కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. ఈ నిధుల్లో రైల్వేశాఖ 592కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 722కోట్లు భరించేలా ఒప్పందం కుదిరింది. అయితే రైల్వేలైన్‌కు అవసరమైన భూసేకరణకు మరో 130కోట్లు కావాలి. కాని దీనిని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలనేది ఒప్పందం. ఇందులో సగం భారం రైల్వేశాఖదేనని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తుంది. భూసేకరణ జరిపి, ఒప్పందం వాటా ప్రకారం నిధులు చెల్లిస్తే పనులు మొదలుపెట్టడానికి మేము సిద్ధంగా వున్నామని రైల్వేశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసింది. కాని రాష్ట్ర ప్రభుత్వం మాత్రం భూసేకరణ విషయంలో సగం మాత్రమే భరిస్తామంటూ పేచీ పెడుతుంది. దీనికి సంబంధించి మీడియాలో వార్తలు రావడంతో ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. భూసేకరణకు అయ్యే ఖర్చునంతా రాష్ట్రమే భరిస్తుందని ప్రకటించారు. ఇది ఎంతవరకు నిజమౌతుందో!


కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' వారపత్రిక



ప్రజల కోసం పుట్టిన పత్రిక
ప్రజాసమస్యలపై పోరాడే కరదీపిక
ప్రజాభిప్రాయాన్ని ప్రజ్వలింపచేసే వేదిక
లాయర్
జాతీయ తెలుగు వారపత్రిక
32 సంవత్సరాలు పూర్తి చేసుకుని
33వ వడిలో అడుగిడుతున్న సందర్భంగా
హృదయపూర్వక శుభాకాంక్షలు.



డా॥ యస్.సత్యనారాయణమూర్తి
B.Sc., M.B.B.S., D.Diab. (Yugoslavia)
Specialist in Diabetes

DIABETES CLINIC NELLORE
DIABETES CLINIC
16/2/219, Pogathota, Nellore - 524001. A.P., India.
E-mail: ssatyamurthy@hotmail.com

PDF Compressor Free Version



# కళ్యాణ వైభవం...!



నెల్లూరులోని అఖిలయ హాస్పిటల్స్ అధినేతలు డా॥ సి.ఉమామహేశ్వర్‌రెడ్డి - మహేశ్వరిల కుమార్తె (ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా॥ గోపాల్‌రెడ్డి మనుమరాలు) **అమూల్య - భానుప్రకాష్‌రెడ్డి**ల కల్యాణం మే 23వ తేదీ నెల్లూరు సిపిఆర్ కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.



తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రొ॥ డా॥ కీర్తి వెంకయ్య - కనకమ్మల కుమారుడు **దినేష్ - మేఘనయాదవ్**ల వివాహం మే23వ తేదీ తిరుపతిలోని సింధూర కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాశీస్సులు.



ఆంధ్రా బ్యాంక్ మాజీమేనేజర్ రావి రమేష్‌బాబు - లీలల కుమారుడు **జయచంద్ర - రత్నప్రతిభ**ల పరిణయం మే 19వ తేదీ నెల్లూరు సిపిఆర్ కల్యాణ మండపంలో వేడుకగా జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.



వింజమూరు వాస్తవ్యులు యల్లాల శ్రీనివాసులురెడ్డి - పద్మావతిల కుమార్తె **వెంకట మానస - వెంకట రాజశేఖర్‌రెడ్డి**ల పెళ్ళి మే 23వ తేదీ పామూరులోని శ్రీ సత్యనారాయణస్వామి కల్యాణ మండపం నందు ఘనంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.

# 'మహో' బా(డా)బు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాన్ని పరిపాలించి వుండడమే. ముఖ్యమంత్రిగా 9ఏళ్లు పనిచేసినా ఆయన రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదు. తెలుగుదేశంపార్టీని మూడుసార్లు తన వ్యక్తిగత ఛరిష్మాతో అధికారంలోకి తెచ్చింది ఎన్టీఆరే! చంద్రబాబు ఒకసారి ఆయన నుండి అధికారాన్ని లాక్కుని ముఖ్యమంత్రి అయితే, 1999ఎన్నికల్లో మాత్రం వాజ్‌పేయి ఇమేజ్‌తో, బీజేపీతో పొత్తు వల్ల ఇంకోసారి ముఖ్యమంత్రి కాగలిగాడు. రెండోసారి అధికారం చేతికి రాగానే కన్నూ మిన్నూ కానకుండా ప్రవర్తించాడు. ప్రజలు నేను చెప్పినట్లు వినాల్సిందేనన్నట్లు వ్యవహరించారు. కంప్యూటర్లు, సిమెంట్‌రోడ్లే లోకమన్నట్లు పరిపాలించి రైతులకు తీరని అన్యాయం చేసాడు. ఆయన హయాంలో ఏ వర్గం ప్రజలు కూడా బాగుపడిన దాఖలాలు లేవు. మరి చంద్రబాబు ఇప్పుడు మహాత్ముడు వేషంకట్టి నేను మారిన మనిషినంటూ ఊదరకొట్టి అవినీతిపై ప్రవచనాలు చేస్తుంటే విని తరించి అధికారాన్ని అప్పగించడానికి జనం చెవుల్లో పూలు పెట్టుకుని లేరుగా!

# లేడీ లీడర్స్

(మొదటిపేజీ తరువాయి)

మహిళలు సామాన్యంగా గడపదాటి బయటకురారు. వస్తే వారి శక్తిసామర్థ్యాల ముందు ఎవరూ నిలవలేరు. జగన్ జైలుకెళ్లి ఏడాది పూర్తయ్యింది. ఈ సందర్భంగా మొన్ననే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ వాళ్లు రాష్ట్రవ్యాప్తంగా కూడా కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. జగన్ జైలుకెళ్లాక వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని ఎవరు నడుపుతారనే సందేహాలు తలెత్తాయి. జగన్‌కు అన్నదమ్ములు లేరు. అప్పటికి చిన్నాన వివేకానందరెడ్డి దూరంగా వున్నాడు. ఇక అమ్మ, భార్య, చెల్లి... సొంత కుటుంబసభ్యులు. వై.యస్ వున్నంత కాలం వీళ్లు రాజకీయంగా గడపదాటి ఎరుగరు. వారి పనేదోవాళ్లు చూసుకునేవాళ్లు. రాజకీయాల్లోకి తాము వస్తామని, ప్రజల మధ్య తాము తిరగాల్సి వస్తుందని వారు కలలో కూడా వూహించి వుండరు.

కాని జగన్ జైలుకెళ్లాక ఏడాది కాలం నుండి పార్టీని నడుపుతున్నది, పార్టీ వెంట ప్రజలను నడిపిస్తున్నది జగన్ ఇంటి ముగ్గురు మహిళలే కావడం విశేషం! జగన్ తల్లి విజయమ్మ, భార్య భారతి, చెల్లెలు షర్మిల... జగన్ బయట లేని లోటును తెలియనీయడం లేదు. జగన్ జైలులో వున్నా జనంకు అండగా మేమున్నామంటూ ప్రజల ముందుకొచ్చారు. విజయమ్మ వైకాపా పరంగా రాజకీయ నిర్ణయాలలో కీలకపాత్ర పోషిస్తున్నారు. నా బిడ్డ స్థానంలో నేనున్నానంటూ ప్రజల పక్షాన పోరాటం చేస్తూ దీక్షా శిబిరాలలో, ఉద్యమాలలో పాల్గొంటున్నారు. జగన్ జైలుకెళ్లడంతో ఓదార్పుయాత్రకు బ్రేక్ పడితే అన్న ఆశయాలను నెరవేర్చే చెల్లిగా షర్మిల మరో ప్రజాప్రస్థానం పాదయాత్రకు శ్రీకారం చుట్టి ప్రజల మధ్య తిరుగుతున్నారు. భార్య సాక్షి పత్రిక, టీవీలలో కీలకపాత్ర పోషిస్తూ జగన్ ఆలోచనలను, ఆశయాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్, తెలుగుదేశంలు జగన్‌కు వ్యతిరేకంగా పన్నుతున్న కుట్రలను ప్రజల ముందుంచుతున్నారు.

జగన్‌ను జైలులో పెడితే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ మూతపడిపోతుందని భావించిన వాళ్లకు ఈ ముగ్గురు మహిళలు పార్టీని విజయవంతంగా నడుపుతుండడం మింగుడుపడడం లేదు. జగన్‌ను జైలులో పెడితే పార్టీ బలహీనపడుతుందనుకుంటే ఈ ముగ్గురు లేడీ లీడర్లతో వైకాపా అంతకంతకు బలం పుంజుకోవడం చూసి తెలుగుదేశం, కాంగ్రెస్ నాయకులు కళ్లు తేలేస్తున్నారు.

# విశాఖలో స్టార్‌వార్

(మొదటిపేజీ తరువాయి)

కేసులెన్నో కోర్టులదాకా నడిచివున్నాయి. ఈ తరహా సంఘటనలు మనకు రాజకీయాలలో చాలానే తారస పడుతుంటాయి. రాజ్యసభ సభ్యులు, కళాబంధు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డికి హైటెక్ దానకర్ణుడనే పేరుంది. సంగీత, కళా, సాంస్కృతిక, మానవతా, ధార్మిక కార్యక్రమాలకు ఆయన భూరి విరాళాలిస్తుంటారు. ఈ దానానికి కొందరు హద్దులు పాటించరు. శిబిచక్రవర్తి తన శరీరాన్ని కోసిచ్చినట్లు, కర్ణుడు తన కవచకుండలాలనే చీల్చిచ్చినట్లు... సుబ్బరామిరెడ్డి కూడా తాను ఎంతో ప్రాణంగా ప్రేమించిన విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గాన్ని 2004 ఎన్నికలప్పుడు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డికి, 2009 ఎన్నికలలో దగ్గుపాటి పురంధేశ్వరికి దానంగా ఇచ్చారు. ఆరోజు బాపట్ల లోక్‌సభ ఎస్సీ అయినందువల్ల పురంధేశ్వరికి మరెక్కడా ఛాన్స్ లేకపోవడంతో టీఎస్ఆర్ పెద్ద మనసు చేసుకుని విశాఖకు రానిచ్చారు. విశాఖతో, విశాఖ ప్రజలకు టీఎస్ఆర్‌కు విడదీయరాని అనుబంధం వుంది. విశాఖ అభివృద్ధికోసం ఆయన సొంత నిధులే కోట్లలో ఖర్చు పెట్టారు. విశాఖలో ఎవరూ వరుసగా రెండుసార్లు ఎంపీగా గెలవలేదు. ఆ ట్రాక్‌రికార్డ్ సుబ్బరామిరెడ్డిదే! ఆయనను విశాఖ ప్రజలు ఎంతగా అభిమానిస్తున్నారనేదానికి ఇది నిదర్శనం.

జాలిపడి విశాఖకు రానిస్తే దగ్గుపాటి దంపతులు ఇప్పుడు టీఎస్ఆర్‌పైనే బురదచల్లుతున్నారు. నాగార్జునసాగర్ కాంట్రాక్టు పనుల్లో సిమెంట్ అమ్ముకున్నాడని దగ్గుపాటి వెంకటేశ్వరరావు అనడం సిగ్గుచేటైన విషయం. అతిచిన్న వయసులో నాగార్జునసాగర్ అంతటి భారీ ప్రాజెక్టును పూర్తి చేసి ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ నుండి ప్రశంసలు అందుకున్న ఘనుడాయన.

కాంగ్రెస్‌పార్టీ పట్ల టీఎస్ఆర్ విధేయతను ఎవరూ వేలెత్తి చూపలేరు. కాని దగ్గుపాటి దంపతులు కాంగ్రెస్ ప్రవేశం ఎలా జరిగిందనేది అందరికీ తెలిసిందే! తెలుగుదేశంలో వుండి చంద్రబాబునాయుడు పన్నిన ఎన్టీఆర్ వెన్నుపోటు కుట్రలో భాగస్వామి వెంకటేశ్వరరావు. చంద్రబాబు సీఎం అయ్యాక, ఉపముఖ్యమంత్రి పదవిని ఇవ్వలేదని అలిగి లక్ష్మీపార్వతి తెలుగుదేశంలో చేరాడు. అక్కడా ఇమడలేక కాంగ్రెస్ శరణువేడాడు. ఇన్ని పార్టీలు మారిన దగ్గుపాటి దంపతులా... కాంగ్రెస్‌పార్టీ సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన టీఎస్ఆర్‌ను వేలెత్తి చూపేది?

# నెల్లూరు నగరం 54డివిజన్లుగా విభజన

నెల్లూరు నగరంలో ఇటీవల విలీనమైన 15గ్రామాలను కలిపి 54డివిజన్లుగా విభజిస్తూ కార్పొరేషన్ ఆదేశాలు జారీచేసింది. ఉత్తరం సర్వేనెంబరు 2062 బౌండరి ఈస్ట్ పెన్నానది, కోడూరుపాడు బౌండరి తూర్పు మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్ మైపాడు రోడ్డు నుంచి 200అడుగుల బైపాస్‌రోడ్డు పడమర 200అడుగులు బైపాస్‌రోడ్డు మునిసిపల్ కార్పొరేషన్ బౌండరి పాతమునిసిపల్ కార్పొరేషన్ హద్దులు పెన్నానది వరకు హద్దులను విభజిస్తూ కార్పొరేషన్ 54డివిజన్లుగా నెల్లూరు నగర కార్పొరేషన్‌ను విభజించారు. పలువార్డులలో ఇటీవల విలీనమైన గ్రామాలను కలిపారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలను స్వీకరించనున్నారు. నగరశివారు ప్రాంతంలో ఉన్న అన్ని వార్డులలో ఇటీవల విలీనమైన ప్రాంతాలను కలుపుతూ 50డివిజన్లను 54 డివిజన్లుగా విభజించారు.

PDF Compressor Free Version



# కదంబం

## కణోన్న కలలు

శిఖా - ఆకాష్
నూజివీడు, 9298901571

రిక్షాలో పూలతోటలు
ఆటోలో తేనె ఊటలు
వ్యానుల్లో సీతాకోక పాటలు
ప్రతి ఉదయానికీ
ఎన్ని నిర్మల హృదయాలో
అవిగవిగో...
తప్పటడుగుల కుందేళ్ళు
వాగువంకలంటి ఉడుత బుడుతలు
నడుముల బస్తాలు
మెడకేమో ఉరితాళ్ళు
ఎ.సిలో నారుమళ్ళు
బాల్యానికి సంకెళ్ళు
కాన్వెంటు నెలవంకలో
రెక్కలొగిగిన గొరవంకలు
ఎగురలేని జెండా కన్నీళ్ళు
కార్పోరేట్ జైలు కౌగిళ్ళు
హైటెక్ కలల లోగిళ్ళు
అవిగవిగో...
ఇంగ్లీషు సెలయేళ్ళు
అమ్మా నాన్నల
డాలర్ కలల్లో
పిల్లలేమో
అమెరికా నక్షత్రాలు!-
తల్లిదండ్రులేమో
అనాథాశ్రమ చిరునామాలు!!

# జగన్‌పై కసితీర్చుకున్న సోనియా

గల్పిక

అది గ్యాంగ్‌రేప్‌లు వంటివి లేని ఢిల్లీ మహా నగరం. టెన్‌జనపథ్‌లో ఏఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ విచారంగా కూర్చుని వుంది. ఎంపీ వి.హెచ్.హనుమంతరావు వంటింటిలో నుండి వచ్చి... మేడమ్, కాఫీ తీసుకోండి అని కోరాడు. జగన్ మీద నా కసి తీరేవరకు పచ్చి మంచినీళ్లు కూడా ముట్టుకోను అని సోనియా అంది. ఆ మాటకు వి.హెచ్... మేడమ్, ఇవి పచ్చి మంచినీళ్లు కావు. బ్రూకాఫీ అని చెప్పాడు. అలాగయితే ఓకే అంటూ సోనియా కాఫీకప్పును అందుకుంది. సోనియాగాంధీ విచారంగా వుండడం చూసి వి.హెచ్. కాంగ్రెస్ నాయకులందరికీ ఫోన్‌లుచేసి రమ్మన్నాడు. అరగంటలో రాహుల్‌గాంధీ, అహ్మద్‌పటేల్, గులాంనబీ ఆజాద్, వీరప్పమొయిలీ, అంబికాసోని, పనబాక లక్ష్మి వంటి దిగ్గజాలంతా అక్కడకు వచ్చారు. ఎందుకు మేడమ్... మీరింత డల్‌గా వున్నారని అహ్మద్‌పటేల్ అడిగాడు. అప్పుడు సోనియా... ఆ పిల్లకాకి జగన్ నా ముందు బచ్చా.. ఢిల్లీ వచ్చి నాకే సవాల్ విసిరాడు. కాంగ్రెస్‌ను వదిలి పోయి వైయస్సార్ కాంగ్రెస్‌ను పెట్టాడు. ఏపిలో కాంగ్రెస్‌ను సర్వనాశనం చేస్తున్నాడు. నా అహంకారం మీద దెబ్బకొట్టాడు. అతని మీద కసితో జైలులో వేయించాను. సంవత్సరం నుండి జైలులోనే వుంటున్నాడు. అయినా అతనిలో పశ్చాత్తాపం కనిపించడం లేదు. జైలు బాధలు పడలేక నన్ను కాపాడమంటూ నా కాళ్లమీద పడతాడనుకున్నాను. నన్ను క్షమాపణ కోరతాడనుకున్నాను. కాని అదేమీ జరగలేదు. కనీసం పశ్చాత్తాపం కూడా లేదు అని పమిటచెంగుతో కళ్లు ఒత్తుకోసాగింది. జగన్ మీద మేడమ్‌కు వున్న పగను తీర్చాలి. ఆమె అహంకారాన్ని చల్లబరచాలి... ఎలా అని కాంగ్రెస్ నేతలంతా మదనపడిపోసాగారు. ఇలాంటి టక్కుటమార జిత్తులమారి సమస్యలకు పరిష్కారం చెప్పేదెవరబ్బా... అని పనబాక లక్ష్మి తన మైండ్‌లో వున్న పేర్లను రివైండ్ చేస్తుంటే... స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(63+) పేరు తగిలింది. వెంటనే ఆమె వివేకాకు ఫోన్ చేసింది. వివేకా వెంటనే నెల్లూరు నుండి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడ నుండి విమానమెక్కి ఢిల్లీలో దిగాడు. నేరుగా టెన్‌జనపథ్‌కు చేరుకున్నాడు. అక్కడ సోనియాతో పాటు మిగతా కాంగ్రెస్ నాయకులంతా కూడా మీ బాధ మా బాధ కాదా అన్నంత విచారంలో వున్నారు. వివేకాను చూడగానే సోనియాకు కొండంత ధైర్యం వచ్చింది. అహ్మద్‌పటేల్ మేడం ఏ సమస్యతో బాధపడుతుందో వివేకాకు వివరించాడు. అంతా విన్న వివేకా... దీనికంత విచారమెందుకు... జగన్ మీద మీ పగ చల్లారాలంటే ఒకటే మార్గం. ముందు అతనిని జైలు నుండి విడుదల చేయించండి అని చెప్పాడు. ఆ మాటకు సోనియాతో పాటు మిగతా వాళ్లు కూడా అవాక్కయ్యారు. ఏయ్ మెంటల్ నువ్వు మతివుండే మాట్లాడుతున్నావా అంటూ ఆజాద్ మండిపడ్డాడు. అందుకు వివేకా... నేను కండీషన్‌లోనే వున్నాను... మీరు చెప్పండి మేడమ్, నా మాట విని జగన్‌ను జైలు నుండి బయటకు పంపేయండి. మీ పగ ఎందుకు చల్లారదో నేను చూస్తానని నమ్మకంగా చెప్పాడు. వివేకా మాటల మీద ఆమెకెందుకో నమ్మకం కలిగింది. జగన్ విడుదలకు పచ్చజెండా వూపింది.

★★★★★

అది భాగ్యనగరంలోని చంచల్‌గూడ జైలు. జగన్ వుంటున్న గది వద్దకు జైలర్ వచ్చాడు. నీకు బెయిలొచ్చింది. బయటకు పోవచ్చన్నాడు. జైలర్ అటు వెళ్లాక 'తొలిప్రేమ' సినిమాలో పవన్‌కళ్యాణ్ లాగా జగన్ సంతోషంతో డ్యాన్స్ వేసాడు. మళ్లీ మామూలుగా తయారై జైలు గేటువద్దకు వచ్చాడు. ఫార్మాలిటీస్ పూర్తయ్యాక గేటు తలుపు తెరచుకుంది. జగన్ అడుగుబయట పెట్టాడు. ఆయనకు ఏదో నిప్పుల మీద అడుగేసినట్లయ్యింది. గేటు దాటి బయటకొచ్చేసరికి ఆయన పరిస్థితి నిప్పులగుండంలో నిలబడినట్లయ్యింది. ఎండ 48డిగ్రీలు కాస్తుంది. జగన్ ఒళ్లు చెమటలు కక్కుతోంది. అక్కడికి దగ్గరలో ఒక్క ఆటో కూడా లేదు. ఆ ఎండలోనే రెండు కిలోమీటర్లు నడిచొచ్చి ఓ ఆటో పట్టుకున్నాడు. ఆటోలో కూడా అగ్నిగుండం మాదిరిగా వుంది. ఎలాగోలా కష్టపడి లోటస్‌పాండ్‌లోని ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో ఒక గంటన్నా ఏ.సి వేసుకుని విశ్రాంతి తీసుకుందామనుకుని గదిలోకి వెళ్లాడు. ఏ.సి ఆన్ చేసాడు. కాని ఆన్ కాలేదు. కరెంట్ వుంటే కదా... అప్పుడే ఆయన భార్య భారతి వచ్చింది. కరెంట్ లేదా అని జగన్ అడిగాడు. రెండురోజులుగా లేదు. మరో రెండు రోజుల్లో రావచ్చంటున్నారు అని చెప్పింది. మరి ఈ ఎండలకు ఎలా తట్టుకుంటున్నారని అడిగాడు జగన్. మేం ఈ ఎండకు కరెంట్ లేక ఇళ్లల్లో నరకయాతన అనుభవిస్తున్నాం. జైలులో మీరే హాయిగా వున్నారని భారతి చెప్పింది. ఆకలిగా వుండడంతో జగన్ డైనింగ్‌టేబుల్ వద్దకొచ్చాడు. ఆత్రంగా పాత్రల మూతలన్నీ తీసాడు. అన్నీ ఖాళీనే. రెండు గిన్నెల్లో మాత్రం అన్నం, పచ్చడి వుంది. అదేంటి... ఒక్క కూర కూడా లేదు.. అని జగన్ అడిగాడు. దానికి భారతి... మీకు జైలులో వుండి ఇక్కడి పరిస్థితులు ఏమీ తెలిసినట్లు లేదు. ఇప్పుడు కూరగాయలు కొని కూరలు వండాలంటే ఆస్తులు అమ్మాలి. ఆ విధంగా మండిపోతున్నాయి రేట్లు. జైలులో వుంటే అన్ని కూరలు వండిపెట్టేవాళ్లు. ఏడాదిగా మీరు జైలులో వున్నారు. సంపాదన లేదు. ఈ పచ్చడి మెతుకులు తప్ప కూరగాయలు కొని తినే పరిస్థితి లేదు అని అంది. అప్పుడే షర్మిల అక్కడకు వచ్చింది. జగన్‌తో... అన్నా! ఈ ఎండల్లో నడిచి నడిచి నా కాళ్లు బొబ్బలెక్కాయి. ఇక పాదయాత్ర చేసే పరిస్థితి లేదు. మీరు వచ్చారు కదా, నా బదులు పాదయాత్రను మీరు పూర్తి చేయండి అని కోరింది. ఈ ఎండల్లో జైలు నుండి ఇంటికొచ్చే సరికే సినిమా కనిపించింది. ఇక రోజూ పాదయాత్ర చేస్తేనా... అమ్మో అనిపించింది జగన్‌కు. వెంటనే ఆయన లేచి చెంచల్‌గూడ జైలు వద్దకు పరుగులు తీసాడు. బయట కంటే జైలులోనే బాగుంది. ప్రశాంతంగా వుంది. నన్ను లోపలకు పోనీయండి అంటూ జైలర్‌ను అడిగాడు. దానికాయన ఒప్పుకోలేదు. జగన్ చివరకు లోపలకు పంపాలని బ్రతిమలాడసాగాడు. తనను మానవతా దృక్పథంతో అర్థం చేసుకోవాలని కూడా కోరాడు. అయినా జైలర్ కనికరించడం లేదు.

జగన్ జైలు నుండి బయటకొచ్చిన క్షణం నుండి ఆయన కదలికలను వివేకా తన సీక్రెట్ ఏజెంట్ ద్వారా సెల్‌ఫోన్ కెమెరాలో షూట్ చేయించాడు. టెన్‌జనపథ్‌లో వివేకా ఆ సెల్‌లో వున్న జగన్ దృశ్యాలను సోనియాకు చూపిస్తున్నాడు. జగన్ బయటకు రావడం, ఎండకు భయపడడం, కరెంట్ లేక ఉక్కపోతతో అల్లాడడం... చివరకు నన్ను జైలులోకి పంపండంటూ జైలర్‌ను వేడుకోవడం... ఈ దృశ్యాలన్నీ చూసేసరికి సోనియా ఆనందంతో గెంతులేసింది. జగన్ మీద ఆమె కసి తీరినట్లయ్యింది. ఇతనికి తగిన శాస్తే జరిగింది. శెభాష్.. వివేకా అని అభినందించింది.

★★★★★

## "వజ్ర సంకల్పం" పుస్తకావిష్కరణ




'వజ్ర సంకల్పం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాగాయకుడు గద్దర్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ మెక్‌స్టార్ ఆడిటోరియంలో ఇటీవల తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమ మలుపులో ఇపుడేం చేద్దాం? అనే అంశంపై కవి సమ్మేళనం జరిగింది. తదుపరి మంచిర్యాల పట్టణానికి చెందిన ప్రముఖకవి, రచయిత చీపెల్లి బాపు రచించిన వజ్ర సంకల్పం(తెలంగాణ దీర్ఘకవిత)ను ప్రజా గాయకుడు గద్దర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్, నడుస్తున్న తెలంగాణ పత్రిక సంపాదకులు డా॥ సి.కాశీం, డా॥ నాళేశ్వరం శంకరం, తెలంగాణ రచయితల వేదిక ఆదిలాబాద్(తూర్పు, పశ్చిమ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోటపెల్లి భూమన్న, తోకల రాజేశం, డా॥ ఉదారి నారాయణ, గోపగాని రవీందర్, ముత్యబోయిన మలయశ్రీ, పత్తి శివప్రసాద్, డా॥ దామెర రాములు, అంబటి నారాయణ, మాసపత్రి ఆశాకిరణ్, ఉషాకిరణ్, వెంకట్, జలంపెల్లి యాదగిరి, కుమ్మరి సురేష్, రేగుంట పోషన్నలు పాల్గొన్నారు.

## చెంగాళమ్మ ఆదాయం 20లక్షలు

నెల్లూరుజిల్లా సూళ్లూరుపేటలో వెలసియున్న శ్రీ చెంగాళమ్మ అమ్మవారి దేవస్థానంలో సోమవారం అమ్మణ్ణి హుండీని లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో హుండీ ఆదాయం రూ.20లక్షల 10వేల 55 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఆలయ ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీనులవిందుగా అన్నమయ్య గీతాలాపన పోటీలు




కావలి పట్టణంలోని క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో సద్భావన - సాధన ఆధ్యాత్మిక, సాంస్కృతిక చైతన్య సంస్థ ఆధ్వర్యంలో మే నెల 25న అన్నమయ్య జయంత్యుత్సవంలో భాగంగా అన్నమయ్య సంకీర్తనల పోటీలు జరిగాయి. పోటీలో సీనియర్ విభాగంలో నెల్లూరుకు చెందిన కార్తీకభరద్వాజ్, ధీరజ్‌సాయిలు ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందగా తృతీయ స్థానంలో కావలికి చెందిన పి.ఐశ్వర్య నిలిచింది. వీరికి సీనియర్ సివిల్ జడ్జి గురప్ప, కళాబంధు గోవిందరెడ్డి, తన్నీరు మాల్యాద్రిలు బహుమతులు అందించారు. జూనియర్ విభాగంలో కనిగిరికి చెందిన మణికంఠసాయి ప్రథమ, నెల్లూరుకు చెందిన ఇ.భానుసాయి ద్వితీయ, నెల్లూరుకు చెందిన జె.వైష్ణవి తృతీయ స్థానాలను పొందారు. కావలి ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఈ పోటీలను ప్రారంభించగా, ప్రముఖ సంగీతజ్ఞులు లక్ష్మీప్రసూన, రమాదేవిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో వాశి సంగీత కళానిలయం సంగీత విద్వాంసులు రాజగోపాలాచార్యులు, అనంత కృష్ణశర్మ, నిర్వాహకులు మారుతీశర్మ, విజయచంద్రలు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా కాశీ విశ్వనాథుని రథోత్సవం

నెల్లూరు నగరం ఉస్మాన్‌సాహెబ్‌పేటలో వెలసియున్న శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత శ్రీ కాశీవిశ్వనాథస్వామి రథోత్సవం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ మహోత్సవంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పాల్గొని విశేషపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి రాజేశ్వరమ్మ పత్తి జయరామయ్యనాయుడు పద్మావతిలు వ్యవహరించారు. ఈ రథోత్సవం ఉస్మాన్‌సాహెబ్‌పేట స్టోన్‌హౌస్‌పేట తదితర పురవీధులగుండా సాగింది. మహిళలు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మధుసూదనరావు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రధానార్చకులు విశ్వనాథ్‌గురుకుల్, గణేష్‌గురుకుల్ శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## శ్రీకృష్ణ యోగమందిరంలో శ్రీనివాస కల్యాణం

నెల్లూరు కొండాయపాళెం గేటు దగ్గర శ్రీకృష్ణ యోగ మందిరంలో శ్రీ వెంకటేశ్వర కల్యాణ మహోత్సవాన సేవాసమితి ఆధ్వర్యంలో మే 25న శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. సేవాసమితి గౌరవ అధ్యక్షుడు వాకాటి విజయకుమార్‌రెడ్డి, అధ్యక్షుడు ఇ.కె.సుబ్రహ్మణ్యంలు పర్యవేక్షించగా తితిదే ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో వేదపండితులు వేదగిరి ఫణిశర్మ, అర్చకస్వాములు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణాన్ని కడు కమనీయంగా జరిపారు.

PDF Compressor Free Version



# కల్యాణ వైభవం...!



మాజీకార్పొరేటర్ పుట్టా రామకృష్ణారెడ్డి - మంజులల కుమార్తె అజిత(చిన్ని)- శ్రీకృష్ణరెడ్డిల పరిణయం మే 29వ తేదీ నెల్లూరు చెముడుగుంటలోని శ్రీడ్స్ ఫంక్షన్‌హాల్‌లో వైభవంగా జరిగింది. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఈ వివాహవేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరులోని ప్రముఖ న్యాయవాది గణపం రాజగోపాలరెడ్డి - వెంకటలక్ష్మిల కుమారుడు సురేంద్రరెడ్డి - నైమికారెడ్డిల వివాహం మే 26వ తేదీ నెల్లూరులోని యంయస్ఆర్ ఫంక్షన్‌హాల్ నందు ఘనంగా జరిగింది. నూతన జంటకు 'లాయర్' శుభాశీస్సులు.



హైదరాబాద్ వాస్తవ్యులు డా॥ చుక్కా కొండయ్య - విజయలక్ష్మిల కుమారుడు చైతన్య - కీర్తికల కల్యాణం మే 23వ తేదీ నెల్లూరులోని యంయస్ఆర్ కల్యాణ మండపం నందు వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

□ మంచికూడలిలో...

# నెల్లూరురూరల్ వైకాపా కార్యాలయం



నెల్లూరు దర్గామిట్టలో రత్నం ఒలింపియాడ్ స్కూల్ ఎదురుగా విశాలమైన ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరురూరల్ కార్యాలయాన్ని బుధవారం ఉదయం ప్రారంభించారు. రూరల్ నియోజకవర్గ సమన్వయ కర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ స్థలం ఎంపికలోనే సక్సెస్ సాధించారు. ఇది మంచి కూడలి. కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో వుంటుంది. పార్టీ మీటింగ్‌లకు కాని, కార్యకర్తల సమావేశాలకు గాని అనువుగా వుండేలా కోటంరెడ్డి ఈ కార్యాలయాన్ని నిర్మించారు. కార్యాలయం మీద వైయస్ చేపట్టిన వివిధ అభివృద్ధి సంక్షేమపథకాలను తెలిపే ఫ్లెక్సీ కటౌట్‌లను, కోటంరెడ్డి చేసిన ఉద్యమాల చిత్రాలను ఏర్పాటుచేసి ఆకర్షణీయంగా మలిచారు. బుధవారం ఉదయం గణపతి హోమం వేదపండితుల మంత్రాలతో పూజలు నిర్వహించి ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. వేదపండితులు, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఆశీర్వదించారు. వైకాపా పొలిట్‌బ్యూరో సభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే జె.కె.రెడ్డి దంపతులు పార్టీ నాయకులు కొమ్మి లక్ష్మయ్య నాయుడు, పి.అనిల్‌కుమార్ యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, డా॥ బాలచెన్నయ్య, కె.బాలకొండయ్య, బి.అనీత, కె.సంజీవయ్య, దబ్బల రాజారెడ్డి, కె.వి. రాఘవరెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, పి.రూప్ కుమార్, మందా బాబ్జీ, పాశం సునీల్‌కుమార్ తదితరులు విచ్చేసి కోటంరెడ్డికి అభినందనలు తెలిపారు.

### సందర్శించిన సుబ్బారెడ్డి:

కాగా గురువారం నెల్లూరులో జరిగిన మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి కుమార్తె వివాహ వేడుకలకు హాజరైన వైకాపా రాష్ట్ర నాయకులు వై.వి.సుబ్బారెడ్డి రూరల్ నియోజకవర్గ వైకాపా కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన పార్టీ కార్యాలయంలో కొంతసేపు వుండి పార్టీ కార్యకర్తలతో ముచ్చటించారు.

# వైభవంగా రాహుకేతు మండపం ప్రారంభం

నెల్లూరు మూలాపేటలోని శ్రీభువనేశ్వరదేవి సమేత శ్రీమూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం రాహుకేతు పూజామండపం, నూతన నాగేంద్రస్వామి(వెండి నాగాభరణం) సంప్రోక్షణ కాలసర్పదోష నివారణార్థం రాహుకేతు సర్పపూజా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మండపాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానంధరెడ్డి ప్రారంభించారు. విపిఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకుడు దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి వివేకానందరెడ్డి వెండినాగాభరణం ఆలయం వారికి అందించారు. ఈ సందర్భంగా ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ రాహుకేతు పూజామండపం నిర్మాణానికి దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి 5లక్షలు ఆలయం వారికి ఇచ్చారని తెలిపారు. ఆలయానికి వెండినాగాభరణం కూడా కానుకగా సమర్పించుకున్నారని ప్రశంసించారు. దాతలు ఆల్తూరు అదినారాయణరెడ్డి, ఇసనాక రమేష్‌రెడ్డి, చిట్టమూరు శ్రీనివాసులురెడ్డి దంపతులు ఆలయంలో ఈ మండపం నిర్మాణానికి ముగ్గురు 3లక్షలు అందించినట్లు తెలిపారు. రేబాల వెంకటరెడ్డి, దొడ్ల చెంచురామిరెడ్డి, పి.నందకిషోర్‌రెడ్డి, ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, చిట్టమూరు శ్రీనివాసులరెడ్డి, ఇసనాక రమేష్‌రెడ్డి నూతన ముత్యాల పంచముత్యాల నాగాభరణం భువనేశ్వరిదేవికి నూతన ముత్యాల చీర కానుకగా ఇచ్చారన్నారు. అనంతరం వీరందరిని ఆలయంలో వివేకానందరెడ్డి శాలువాలతో, పూలమాలతో సత్కరించారు. దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గతంలో ఎన్నో స్వచ్ఛంధ సంస్థలకు, అనాథ శరణాలయాలకు, విద్యార్థులకు కిట్‌ల రూపంలోను, ఆర్థిక రూపంలోను సహాయ సహకారాలను అందించారు. శ్రీ వెంకటేశ్వర కస్తూరిభా కళాక్షేత్రం వద్ద అమరగాయకులు స్వర్గీయ పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి ఇతర ఎన్నో విగ్రహస్థాపనలకు చేయూత అందించారు. ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి డీసీసీ ఇన్‌ఛార్జి అధ్యక్షుదు చాట్ల నరసింహారావు, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




PDF Compressor Free Version



**మేషం** (అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము)

కొత్త పెట్టుబడులు, ఆర్థికాభివృద్ధి పరంగా ఆలోచనలుంటాయి. వృత్తి వ్యాపారాలలో పెరుగుదల, ఆదాయం బాగుంటుంది. కుటుంబవ్యవహారాలలో కుటుంబసభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు ఏర్పడవచ్చును. శుభకార్య ప్రయత్నాలలో ప్రతిబంధకాలుంటాయి. కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది. పనులు టెన్షన్ పెడుతూ నిదానంగా జరుగుతాయి.

**వృషభం** (కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు)

ఆర్థికస్థితి బాగుంటుంది. వృత్తిపరంగా మంచి అభివృద్ధి ఆదాయముంటుంది. వ్యాపారులకు మంచి అర్థికావకాశాలు దొరుకుతాయి. ఆదాయవృద్ధి కలదు. శుభకార్యాలలో పాల్గొంటారు. ప్రయాణ శ్రమ పెరుగుతుంది. ప్రముఖులను, మిత్రులను కలుసుకొనడం సంప్రదింపులు జరపడముంటుంది. రాజకీయ వ్యవహారాలలో గాని, ఆర్థిక వ్యవహారాలలోగాని తొందర చూపకండి.

**మిథునం** (మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు)

పెట్టుబడి అవకాశాలు, వ్యాపార భాగస్వామ్యమునకు పిలుపు లభించవచ్చును. వృత్తులు బ్రోకర్లు ఏజంట్లకు ఆదాయం పెరుగుతుంది. ఆస్తి పంపకాలు, ఆర్థిక లావాదేవీలు ప్రస్తుతం వాయిదా పడటం మంచిది. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. నిరుద్యోగులకు ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి.

**కర్కాటకం** (పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష)

ఆర్థిక పరమగు లావాదేవీలు సమస్యలుగా మారుతాయి. రావలసిన బాకీలు నిలబడటం, చెల్లింపులపై వత్తిడి పెరుగుతుంది. బంధుముఖ్యుల యొక్క అనారోగ్య వార్తలు వింటారు. వ్యాపారాలలో కొద్ది నష్టాలు, మంచి ఆర్థికావకాశాలు చేజారిపోవడం జరుగుతుంది. అగ్రిమెంట్లు, హామీలకు దూరంగా ఉండండి. ఉద్యోగులు అధికారులతో అనుకూలంగా మెలుగుతారు.

**సింహం** (మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము)

బంధుమిత్రులతో ఉల్లాసంగా గడపడం, క్రొత్త పరిచయాలుంటాయి. శుభకార్యాలలో పాల్గొనడం, శుభకార్యాలు నిర్వహించడం జరుగుతుంది. కోర్టు కేసులలో అనుకూలత ఉంటుంది. వృత్తివ్యాపారాలలో క్రొత్త అవకాశాలు రావడం, ఆదాయం పెరగడం జరుగుతుంది. విలువైన వస్తువులు, నగదు జాగ్రత్త పరచుకొనండి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించే స్థితి ఉన్నది.

**కన్య** (ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు)

ఆరోగ్యము సరిగా ఉండక బాధ పెట్టినా, అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. దూరప్రాంతం నుండి ఆహ్వానాలు అందుకొనడం, అందుకొరకై ప్రయాణాలుంటాయి. శుభకార్యప్రయత్నాలు ఫలించగలవు. వృత్తి వ్యాపారాలలో నిలద్రొక్కుకొనడం, రాబడి పెరగడం జరుగుతుంది. కుటుంబం మీద మీ నిర్ణయాలు రుద్దకండి. కుటుంబసభ్యులకు స్వేచ్ఛ ఇవ్వండి.

# రాశి - మీ వాసి

తేది. 31.05.2013 నుండి
తేది. 06.06.2013 వరకు

ఈ వారం కుంభ మీన మేష రాశులలో చంద్రుడు, వృషభంలో రవికుజులు, మిధునంలో గురు బుధులు శక్రుడు, తులలో శని రాహువులు సంచరిస్తారు.

**పంచాంగము :**

తేది 31 శుక్రవారం సరస్వతీదేవి పుష్కరాలు ప్రారంభము. తేది 5 బుధవారం నుండి గురుమౌఢ్యమి ప్రారంభము. తేది 3 సోమవారం హనుమజ్జయంతి.

**ముహూర్తములు :**

తేది 31 శుక్రవారం ఉదయంగంట 6.30 నుండి 8.30లోగా మిధున లగ్నమున ఉపనయన వ్యాపార వివాహ అక్షరాభ్యాస కేశఖండనలు. తేది 2 ఆదివారం రాత్రి గంట 12.00 నుండి 1.30లోగా కుంభలగ్నమున గృహప్రవేశము.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

**వైశాఖమాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 31 | శుక్ర | సప్తమి | రా॥ గం.6.30వ॥ |
| తేది. 01 | శని | అష్టమి | సా॥ గం.5.00వ॥ |
| తేది. 02 | ఆది | నవమి | సా॥ గం.4.00వ॥ |
| తేది. 03 | సోమ | దశమి | సా॥ గం.3.28వ॥ |
| తేది. 04 | మంగళ | ఏకాదశి | సా॥ గం. 3.15వ॥ |
| తేది. 05 | బుధ | ద్వాదశి | సా॥గం.3.48వ॥ |
| తేది. 06 | గురు | త్రయోదశి | సా॥గం. 4.45వ॥ |

**తుల** (చిత్ర 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

ఆర్థిక విషయాలలో గాని కుటుంబ విషయాలలో గాని అతిగా ఆశలు, ఆలోచనలు పెట్టుకొనవద్దు. వృత్తి పరంగా పలుకుబడి పెరుగుతుంది. వ్యాపార వర్గాలకు ఆర్థికస్థితి బాగుండి ఆదాయము తృప్తికరంగా ఉంటుంది. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం కాగలదు. శుభకార్యాలలో పాల్గొనడం, ప్రయాణశ్రమ ఎక్కువగా ఉంటుంది.

**వృశ్చికం** (విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

బంధువులు, కుటుంబసభ్యులతో భేదాభిప్రాయాలు కలుగ వచ్చును. పనులు అనుకున్న విధంగా జరుగుతున్నా ఆటంకాలు ఎదురుకాగలవు. వ్యాపారవర్గాలకు అవకాశాలు తప్పిపోవడం, ఆదాయం తగ్గిపోవడం, అధికంగా ఖర్చులు పైనబడటం జరుగుతుంది. బంధుముఖ్యుల అనారోగ్యవార్తలు తెలుస్తాయి. పెట్టుబడులు, జాయింట్ వెంచర్ల విషయంలో ఆలోచన అవసరం.

**ధనుస్సు** (మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము)

ఈ రాశివారికి ఆదాయానికి తగ్గ ఖర్చులు పెరుగుతాయి. చదువులు, శుభకార్యాల ప్రయాణ ఖర్చులు అధికం కాగలవు. వృత్తివ్యాపారాలలో తీరిక దొరకదు. మంచి వ్యాపార అవకాశాలు, పెట్టుబడి అవకాశాలు లభించగలవు. అనుకున్న పనులు, కార్యక్రమాలు నిదానంగా సాగుతాయి. స్థిరాస్తులు క్రయవిక్రయాలలో తొందరవద్దు.

**మకరం** (ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు)


పలుకుబడి, మాట చలామణి బాగున్నా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. వేడుకలు శుభకార్యాలలో పాల్గొనడం, తద్వారా ఖర్చులు ఉండగలవు. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు చేజారిపోవచ్చును. కోర్టు వ్యవహారాలు ఆందోళన కలిగించవచ్చును. బంధువర్గంతో విభేదాలు చోటు చేసికొంటాయి. ముఖ్య వస్తువులు, డబ్బు జాగ్రత్త పెట్టుకొనవలెను.

**కుంభం** (ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.)

ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. వ్యాపారంలో అదనపు పెట్టుబడులు, అభివృద్ధికి కృషి చేస్తారు. ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తులపై రాబడి, రావలసిన బాకీలు కొంత లభించడం, దూరప్రయాణాలు నిర్ణయం కావడం జరుగుతుంది. స్థిరాస్తులు, ఇండ్లు కొనే ప్రయత్నము జరుగవచ్చును. శుభకార్య ప్రయత్నాలు పెరుగుతాయి. దైవకార్యాలలో పాల్గొంటారు.

**మీనం** (పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి)

వృత్తివ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వ్యాపార విస్తరణ, పెట్టుబడులు, పొదుపు పథకాలపై దృష్టి పెడతారు. ఆదాయం పెరుగుతుంది. ఆదాయానికి తగ్గట్లు ఖర్చులు రూపొందించుకొంటారు. బంధువర్గంతో బంధాలు బలపడగలవు. శుభకార్యాలలో పాల్గొనడం, దైవదర్శనం, ప్రయాణాలుంటాయి. అనవసర విషయాలకు దూరంగా ఉండటం మంచిది.

Dr. SRK. SCHOOL
Magunta Layout, NELLORE - 524 003. Phone: 0861 - 2325199.

Parent's First Choice - విలువలతో కూడిన విద్యాసంస్థ

2013 - SSC పరీక్షా ఫలితాలు



SAKAMURI HARSHITHA
(H.T.No. 1317108012)
GPA 10/10
STATE RANKER



R. Surya 9.8/10 | R.V.Gayathri 9.8/10 | P.Dedeepya 9.8/10 | S. Navya 9.8/10 | M. Dhavanth 9.8/10 | G.Sumadhura 9.8/10 | A.V.S.Dheeraj Kumar 9.8/10 | S.Divya 9.8/10

అత్యుత్తమ ఉపాధ్యాయులు - విద్యార్థుల మేలి కలయిక

| GPA | 9.7 | 9.5 | 9.3 | 9.2 | 9.0 | 8.8 | 8.7 | 8.5 | 8.3 | 8.2 | 8.0 | 7.8 | 7.7 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| No.of Students | 15 | 19 | 17 | 15 | 13 | 16 | 10 | 8 | 5 | 10 | 2 | 5 | 3 |

------ ప్రతి విద్యార్థి ప్రగతే మా లక్ష్యం ------

| Subject | TELUGU | HINDI | ENGLISH | MATHS | SCIENCE | SOCIAL |
|---|---|---|---|---|---|---|
| A1 | 48 | 25 | 03 | 128 | 78 | 74 |
| A2 | 78 | 73 | 35 | 31 | 51 | 53 |

Overall Results 98%

L.K.G. నుండి 8వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుచున్నవి.

School Reopens : 6th June

School Timings: 9-20 A.M. to 5-00 P.M.

Smt. M. Beulah Grace, B.Sc., B.Ed., Head Mistress

Sri P. Krishna Murthy, M.Com., Correspondent

PDF Compressor Free Version



# కల్యాణ వైభవం...!

## నేహ - రోహిత్





నెల్లూరీయుడు, ప్రముఖ ఆడిటర్, దివంగత మహానేత డా॥ వై.యస్.ఆర్ కుటుంబానికి ఆత్మీయుడు వేణుంబాక విజయసాయిరెడ్డి - సునందల కుమార్తె **నేహా - రోహిత్** (మరో నెల్లూరీయుడు, విజయసాయిరెడ్డికి క్లాస్‌మేట్, అరవిందో ఫార్మా ద్వారా నెల్లూరీయుల కీర్తిని ప్రపంచవ్యాప్తంగా రెపరెపలాడిస్తున్న పెనాక వెంకటరామ్‌ప్రసాద్‌రెడ్డి - సునీలల కుమారుడు)ల వివాహం మే 26వ తేదీ హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసి నొవాటెల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది.

వైకాపా గౌరవాధ్యక్షురాలు వై.యస్.విజయమ్మ, జగన్ సతీమణి భారతి, వైకాపా నాయకురాలు కొండా సురేఖ తదితరులతో పాటు అన్ని రాజకీయ పక్షాల నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు పెద్దఎత్తున వివాహా వేడుకకు మరియు అదే ప్రాంగణంలో మే27న జరిగిన రిసెప్షన్‌కు హాజరై నవదంపతులను దీవించారు.

వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## తారక రామలక్ష్మి - కార్తీక్‌రెడ్డి



మహానటుడు నందమూరి తారకరామారావుకు అత్యంత ప్రియశిష్యుడు, మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి - మాజీమున్సిపల్ ఛైర్మెన్ శ్రీమతి అనూరాధల కుమార్తె **తారక రామలక్ష్మి - కార్తీక్‌రెడ్డి** (కనుపర్తిపాడు వాస్తవ్యులు మంత్రులను జైలుకు పంపాలంటూ సుప్రీంకోర్టు నుండి ఆదేశాలు పొందిన నెల్లూరు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి - సురేఖల కుమారుడు)ల కల్యాణం మే 30వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో వేడుకగా జరిగింది. తెలుగుదేశంపార్టీ నాయకులతో పాటు వివిధ రాజకీయపక్షాల నాయకులు, ప్రముఖులు, వైకాపా రాష్ట్ర నాయకులు వై.వి.సుబ్బారెడ్డి తదితరులు విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించారు. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.

# జైల్లో వున్నా జనం జగన్ వైపే

**- కాకాణి గోవర్ధన్‌రెడ్డి**

అక్రమంగా ఆస్తులు సంపాదించాడంటూ జగన్‌పై అక్రమకేసులు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ ఈనెల 28న నెల్లూరులో నిరసనదీక్ష చేపట్టింది. దీక్షలో పాల్గొన్న వైఎస్సార్సీపీ సీఈసీ సభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ టీడీపితో కుమ్మక్కై కాంగ్రెస్ ప్రభుత్వం జగన్‌ను జైల్లో పెట్టిందని అన్నారు. అక్రమ కేసులుపెట్టి జగన్‌ను జైల్లో పెట్టిన కాంగ్రెస్ కుట్రకు వారి మంత్రులే కేసుల్లో ఇరుక్కున్నారని, కాంగ్రెస్‌పార్టీ తాను తీసిన గోతిలో తానే పడ్డట్టయ్యిందని పేర్కొన్నారు. జగన్ కాంగ్రెస్‌లో వుండుంటే ముఖ్యమంత్రి లేదా కేంద్రమంత్రిని చేసుండేవారమని కేంద్రమంత్రి గులాంనబీ ఆజాద్ ఇంతకు ముందు చెప్పారన్నారు. జగన్ జైల్లో వున్నా ప్రజలంతా వైయఎస్సార్సీపీ వైపే వున్నారని, ఏరోజు ఎన్నికలొచ్చినా రాష్ట్ర ప్రజలంతా జగన్‌ను ముఖ్యమంత్రిని చేస్తారని పేర్కొన్నారు. వైయస్‌రాజశేఖరరెడ్డి పాదయాత్రకు, చంద్రబాబు పాదయాత్రకు పోలికే లేదని, చిత్తశుద్ధితో దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేస్తే, చంద్రబాబు రాజకీయ లబ్ధికోసం మొక్కుబడియాత్ర చేసారని దుయ్యబట్టారు. చిరంజీవి ప్రచారానికి తప్ప ఓట్లకు పనికిరారని, ఆయన చరిష్మా కాంగ్రెస్‌కు ఉపయోగపడదన్నారు.

# "సంకీర్తనా కోకిల" బాలార్క

## అమెరికాలో బిరుదు ప్రదానం



అమెరికాలోని డల్లాస్ నగరంలో మే నెల 24, 25, 26తేదీల్లో జరిగిన తానా 19వ ద్వైవార్షిక సభలలో పాల్గొన్న నెల్లూరీయురాలైన సుప్రసిద్ధ సంగీత కళాకారిణి శ్రీమతి బాలార్కను "సంకీర్తనా కోకిల" బిరుదుతో అమెరికాలోని భారతీయులు సత్కరించారు. తానా సభలలో తన గానామృతాన్ని పంచిన బాలార్కను తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (టాన్‌టెక్స్) సభ్యులు ఘనంగా సత్కరించి 'సంకీర్తనా కోకిల' బిరుదును ప్రదానం చేసారు. బాలార్క లాంటి కళాకారులు తమ డల్లాస్ నగరానికి రావడం చాలా సంతోషంగా వుందని సంస్థ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ ఛైర్‌పర్సన్ శ్రీమతి షబ్నమ్‌మోడ్గిల్ బాలార్కను పై బిరుదుతో సత్కరించారు. మే 13 నుండి 17రోజుల పాటు అమెరికా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఈరోజు(మే31)న భారతదేశానికి తిరిగి వచ్చిన బాలార్కకు 'లాయర్' అభినందనలు.

# నేరచరిత్ర వివరాలను సేకరించండి

**గుంటూరు రేంజ్ ఐజి సునీల్‌కుమార్**

రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల నేరచరిత్ర వివరాలను సేకరించాలని, కీలకంగా వ్యవహరించే చోటా నాయకులు, కార్యకర్తల నేరచరిత్రపైనా నిఘా ఉంచడంతో పాటు వారి వివరాలను సేకరించాలని గుంటూరు రేంజ్ ఐజీ సునీల్‌కుమార్ ఆదేశించారు. రేంజ్ ఐజీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా బుధవారం నెల్లూరు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ రమణకుమార్ ఆధ్వర్యంలో నెల్లూరు ఉమేష్‌చంద్ర సమావేశమందిరంలో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఐజి మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పంచాయితీపై ఇంటలిజెన్స్ నివేదిక తయారుచేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఆర్‌ఏఎస్పీ ఐఆర్‌ఎస్ మూర్తి డిఎస్పీలు వెంకటనాథ్‌రెడ్డి, బాలవెంకటేశ్వరరావు, చౌడేశ్వరి దేవి, ఇందిర, రాజ మహేంద్రనాయక్, ఎస్బీ సిఐ జయరామ సుబ్బారెడ్డి, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## కాలధర్మం

# బెజవాడ వెంకట్రామిరెడ్డి


ప్రముఖ వ్యాపారవేత్త, శరత్ సీఫుడ్స్ భాగస్వామి బెజవాడ వెంకట్రామిరెడ్డి మే 24వ తేదీ ఆకస్మిక గుండెపోటుతో కాలం చేశాడు. వెంకట్రామ్ వయసు 58సంవత్సరాలు. అత్యున్నత చదువులు చదివిన వెంకట్రామ్‌కి ఏ వ్యాపారం చేసినా కలసి రాలేదు. మనిషి మంచి సౌమ్యుడు, స్నేహశీలి. ఆయన కుడితిపాళెం వాస్తవ్యుడు బెజవాడ రామచంద్రారెడ్డి కుమారుడు. అతి చిన్నవయసులోనే వెంకట్రామ్ కన్నుమూశాడు. వెంకట్రామ్ మామ గుండ్రా జనార్ధన్‌రెడ్డి నెల్లూరీయులకు సుపరిచితుడే. నెల్లూరులో మొట్టమొదటి 70యం.యం థియేటర్ నర్తకిని నిర్మించిన ఘనత జనార్ధన్‌రెడ్డిది. జనార్ధన్‌రెడ్డి చాలా మంచివాడు. ఎదిగేకొద్దీ ఒదగాలనే స్వభావం కలిగిన వాడు. ఆయన ఏకైక కుమార్తెను వెంకట్రామ్‌రెడ్డికిచ్చి పెళ్లి చేశాడు. ఆయనకు ఇద్దరు మనుమళ్ళు. ఇప్పుడు వారి బాధ్యత జనార్ధన్‌రెడ్డిపై పడింది. మృదుస్వభావిగా అందరితో మంచిగా వుండే జనార్ధన్‌రెడ్డికి దేవుడు పెద్ద కష్టమే ఇచ్చాడు. ఆయనకు మనోస్థైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటూ వారి కుటుంబసభ్యులకు సంతాపాన్ని తెలుపుతోంది 'లాయర్'.

## మనసులు దోచిన మనసు మమత


జయంపు కృష్ణను సత్కరిస్తున్న సుమన్

మల్లెమాల సంస్థ తరపున ఈటివిలో డైలీ సీరియల్‌గా రాత్రి 7.30గం॥కు ప్రసారమవుతూ అశేష ప్రేక్షకుల వీక్షణ విజయాన్ని సాధించిన సీరియల్ "మనసుమమత". అనేక మలుపులతో ఉత్కంఠభరితంగా కొనసాగుతున్న ఈ సీరియల్ ఇప్పటికే 700ఎపిసోడ్లను దాటి ముందుకు వెళుతోంది. ఈ గమనంలో అనేక కళాసంస్థల ద్వారా ఈ సీరియల్ నాలుగుసార్లు "ఉత్తమ సీరియల్ అవార్డు"లను దక్కించుకొంది. మొదటిసారి శాసనమండలి చైర్మెన్ చక్రపాణి ద్వారా, రెండవసారి జ్ఞానపీఠ అవార్డ్ గ్రహీత డా॥సి.నారాయణరెడ్డి ద్వారా, మూడవసారి సినీ హీరో సుమన్ ద్వారా, నాలుగవసారి మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ద్వారా ఆ పురస్కారాలు పొందింది. ఈ నాలుగు ప్రదానోత్సవాలు హైదరాబాద్ రవీంద్రభారతిలోనే జరిగాయి. ఆ నలుగురి ద్వారా ఆ పురస్కారాలను ఆ సీరియల్ స్క్రిప్ట్ కో ఆర్డినేటర్ జయంపుకృష్ణ అందుకోవడం విశేషం. త్వరలోనే జరిగే ప్రభుత్వ నంది అవార్డుల ప్రదానోత్సవంలో కూడా ఆ సీరియల్ ఉత్తమ దర్శకుడిగా అనిల్‌కుమార్, ఉత్తమ నటుడుగా శుభ లేఖ సుధాకర్ నందులను అందుకోబోతున్నారు.

అలాగే ఈ సీరియల్ నిర్మాత మల్లెమాల శ్యాంప్రసాద్‌రెడ్డి తనయ శ్రీమతి దీప్తిరెడ్డి కూడా ఈటివిలో ప్రసారమైన "అదుర్స్" ప్రోగ్రామ్‌కు నంది అవార్డ్ అందుకోబోతున్నారు.



## 5 ని॥ల అల్లు

రామ్‌చరణ్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఎవడు' సినిమాలో అల్లు అర్జున్ అతిథిపాత్ర పోషిస్తున్నాడు. అయితే ఇది 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' తరహాలో భారీ మల్టీస్టారర్ సినిమా కాదు. ఇందులో అల్లు అర్జున్ పోలీసు పాత్రలో కేవలం 5నిమిషాలు మాత్రమే కనిపిస్తాడు. ఈ సినిమా జూన్ 14వ తేదీన విడుదల కాబోతుంది. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. రామ్‌చరణ్, బన్నీ అభిమానులు ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు.

## సిబిఆర్‌పై అల్లుడు

మూ'వీ'క్షణం



పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న 'అత్తారింటికి దారేది' సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతుంది. పవన్ హోండా సిబిఆర్ 250పై ఎంతో స్టైలిష్‌గా కనిపించారు. ఈ సినిమాలో పవన్ పాత్ర చాలా ఆసక్తికరంగా వుంటుందని సమాచారం. త్రివిక్రమ్ సినిమాల్లో వుండే కామెడీ, మంచి క్వాలిటీతో ఈ సినిమాను నిర్మిస్తున్నారు.



## బుక్కైన సనాఖాన్

'కత్తి', 'మిస్టర్‌నూకయ్య' వంటి సినిమాల్లో నటించిన హాట్ భామ సనాఖాన్ ఓ కిడ్నాప్ కేసులో బుక్ అయ్యింది. తన కజిన్ నవేద్‌ఖాన్ 15ఏళ్ల ఓ యువతిని కిడ్నాప్‌చేసి పెళ్ళి చేసుకోవడానికి ప్రయత్నించగా దానికి సహకరించినందుకు ఈమెపై కేసు పెట్టారు. సనాఖాన్ పక్కనుండి మరీ కిడ్నాప్ చేయించిందనే ఆరోపణల మీద కేసు నమోదు చేశారు.

## గంటకు లక్ష



యాంకర్‌గా కెరీర్ ప్రారంభించిన అనసూయ ఇప్పుడు బిజీగా మారింది. దీపముండగానే ఇళ్ళు చక్కబెట్టుకోవాలనే రీతిలో తన రెమ్యూనరేషన్‌ను భారీగా పెంచేసింది. ప్రస్తుతం ఈ భామ రేటు గంటకు అక్షరాలా లక్ష రూపాయలట! ఆమె మొన్నటిదాకా కేవలం 40 వేలు ఛార్జ్ చేసేది!



# గూడూరు డివిజన్ వార్తలు

## తెలుగుదేశం, కాంగ్రెస్‌లు జగన్‌పై కక్ష సాధిస్తున్నాయి

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొలేక కాంగ్రెస్, టిడిపిలు కుమ్మక్కై, కుట్రలతో జైల్లోపెట్టాయని ఆ పార్టీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి అన్నారు. జగన్మోహన్‌రెడ్డిని అక్రమంగా నిర్బంధించి ఏడాదైన సందర్భంగా పట్టణంలోని టవర్‌క్లాక్ కూడలిలో వైఎస్సార్‌సిపి నాయకులు సోమవారం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సిబిఐ సాయంతో జగన్మోహన్‌రెడ్డిని జైలుపాలు చేసిందన్నారు. జగన్ బయటకు వస్తే కాంగ్రెస్, టిడిపిలు భూస్థాపితం అయిపోతాయనే భయంతో బెయిల్ రాకుండా అడ్డుకుంటూ ఏడాదిగా జైల్లో ఉంచారన్నారు. సాక్షాత్తు సోనియాగాంధీ అల్లుడు వేలాది ఎకరాల భూములు నామమాత్రంగా కొని అనతికాలంలోనే వాటి విలువలు పెంచుకున్నారన్నారు. అది తప్పులేదని సాక్షాత్తు ఆర్థికమంత్రి చిదంబరమే పేర్కొనడం దారుణమన్నారు. సోనియా అల్లుడికి ఒక న్యాయం, జగన్మోహన్‌రెడ్డికి మరో న్యాయమా అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ నాయకులు నేదురుమల్లి పద్మనాభరెడ్డి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్, రూరల్ మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నాశిన నాగులు, రాజేశ్వరరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, తుమ్మల మోహన్‌నాయుడు, మాజీ కౌన్సిలర్ ఎంబేటి చంద్రయ్య, బొమ్మిడి శ్రీనివాసులు, గురవయ్య, పరుచూరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కాగా స్థానిక మోతీమహల్ కూడలి ప్రాంతంలోని వైయస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సిపి నియోజకవర్గ సమన్వయకర్త చెంతాటి బాలచెన్నయ్య కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించి చెన్నకేశవస్వామి ఆలయంలో జగన్‌ను విడుదల చేయాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు మంత్రివర్గ ఆమోదానుసారమే భూములను కేటాయించడం జరిగిందన్నారు. ఈ విషయంలో మంత్రులు దోషులుకాకుండా, సంబంధంలేని జగన్‌మోహన్‌రెడ్డి ఎలా దోషి అవుతారని ఆయన ప్రశ్నించారు. ప్రజల్లో జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ఓర్చుకోలేక టిడిపి, కాంగ్రెస్ కుమ్మక్కై ఏడాదిగా జైల్లో ఉంచాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీకి పునర్జీవం తీసుకొచ్చిన వైఎస్సార్ కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేయడం మంచిదికాదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ కౌన్సిలర్ తాళ్ళూరు శ్రీనివాసులు, రత్నం, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికులకు భూములు పంచాలి

భూమిలేని ప్రతి వ్యవసాయ కార్మికుడికి భూములు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేసారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆయన గిరిజనులతో కలసి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ప్రతి కార్మికకుటుంబానికి 35కిలోల బియ్యంతో పాటు పచ్చతోరణం పథకం కింద రెండున్నర ఎకరాల భూమిని ఇవ్వాలన్నారు. మనుబోలు మండలం గొట్లపాళెంలో 35గిరిజనుల కుటుంబాలుండగా 12కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారని తెలిపారు. అలాగే డివిజన్ పరిధిలోని పలు మండలాల అర్జీదారులు సమస్యలపై సబ్‌కలెక్టర్ నివాస్‌కు అర్జీలు అందజేశారు.

## ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మ వారి దర్శనం కోసం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అమ్మ వారికి చీర, సారెపెట్టి మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో ఆవుల వెంకటేశ్వర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### హుండీ లెక్కింపు:

భక్తుల కల్పవల్లిగా పేరుగాంచిన కనుపూరు ముత్యాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు మేనెల 27న జరిగింది. 53 రోజులలో భక్తులు సమర్పించిన నగదు, కానుకలు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది లెక్కించగా 9,70,609రూ॥ల ఆదాయం వచ్చినట్టు తెలిసింది. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ మాజీ సభ్యులు రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామదేవత తాళమ్మకు పొంగళ్లు

గూడూరు పట్టణంలోని విజయనగర్‌కాలనీ వద్దగల గ్రామదేవత తాళమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పొంగళ్లు నైవేద్యం అమ్మవారికి పెట్టారు. అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా సమీప ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మ వారికి నైవేద్యాలు సమర్పించారు.

## కళ్యాణ వైభవం...!



గూడూరు వాస్తవ్యులు పాశం శ్రీనివాసులురెడ్డి - సునందల కుమారుడు దివ్యతేజారెడ్డి - కీర్తనరెడ్డిల వివాహం మే 23వ తేదీ నెల్లూరు చెముదుగుంటలోని శ్రీడ్స్ ఫంక్షన్‌హాల్‌లో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.


పాత్రికేయ రంగంలో 32 ఏళ్ళ ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని 33వ వసంతంలోకి అడుగుపెడుతున్న

లాయర్

జాతీయ తెలుగు వారపత్రికకు

శుభాకాంక్షలు.



డా॥ సునీల్ కుమార్‌రెడ్డి అట్ల

B.D.S; (MYS) FAGE (MAN)

DENTISTRY IN EXCELLENCE

అశ్విని మల్టీస్పెషాలిటీ దంత వైద్యశాల

రామలింగాపురం మెయిన్‌రోడ్ ( ఆఫీస్ ప్రక్కన ) నెల్లూరు.

ఫోన్: 0861 - 2321352, క్లినిక్: 0861 - 2321353.

పత్రికా రంగంలో 32 వసంతాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని
33వ వడిలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా

లాయర్
జాతీయ వారపత్రికకు
శుభాకాంక్షలతో...

# ఇన్వెస్టర్లకు శుభవార్త...

శ్రీ గునపాటి శ్రీధర్‌రెడ్డి గారి సారధ్యంలో...

నెల్లూరు కోనసీమగా ప్రసిద్ధిగాంచిన నారాయణరెడ్డిపేటలో ఆహ్లాదకరంగా రూపొందించబడిన మా తొలి వెంచర్ 'గునపాటి లే అవుట్'ని నెల్లూరీయుల ఆదరాభిమానాలతో విజయవంతంగా పూర్తి చేసుకుని... నేడు మా రెండవ వెంచర్

# గునపాటి గార్డెన్స్

నారాయణరెడ్డిపేట, నెల్లూరు.

అందమైన వాతావరణంలో, అందుబాటు ధరలతో అందిస్తున్నాము.












- నెల్లూరు, నారాయణరెడ్డిపేట మెయిన్‌రోడ్డును ఆనుకుని సువిశాల ప్రాంగణంలో గునపాటి గార్డెన్స్ రూపకల్పన జరుగుతున్నది
- నెల్లూరు రైల్వేస్టేషన్ నుండి కేవలం 10నిమిషాల ప్రయాణం
- ప్లాట్ రిజిస్ట్రేషన్ అయిన వెంటనే స్వంత ఇల్లు కట్టుకునేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించబడుతున్నవి
- సువిశాలమైన రోడ్లు • పక్కా వాస్తు • మంచినీటి వసతి
- డ్రైనేజీ సౌకర్యం • విద్యుత్ సదుపాయం • 24గంటలు రవాణ

చుట్టూ ప్రహరీతో మొట్టమొదటిసారి "గేటెట్ కమ్యూనిటీ"గా కట్టుదిట్టమైన భద్రతతో నెల్లూరులో ఏర్పడుతున్న అతిపెద్ద లే అవుట్ "గునపాటి గార్డెన్స్"

## గునపాటి గార్డెన్స్

15/465, వెంకట్రామాపురం, నెల్లూరు.
ఫోన్: 0861 - 2340066.
సెల్: 94914 51115
98666 82883
99898 61136

Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.